
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 15-1-2021 ₹15/-










# కరోనా 2020

వస్తుత్వాన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

GEETURAI WEEKLY



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in



సంపుటి 43 సంచిక: 3 హైదరాబాద్
శుక్రవారం 15 జనవరి 2021 రూ.15-00
1 జమాదల్ ఆఖిర్ 1442 హిజ్రీ


**తొలిగీటు**

మీరు పరస్పరం సంబంధాలు త్రెంచుకోకండి. ఎడమొహం, పెడమొహంతో ఉండకండి. పరస్పరం ద్వేషించుకోకండి. అసూయ చెందకండి. దైవదాసులారా! పరస్పరం అన్నదమ్ములుగా ఉండండి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


సంపాదకులు
ఎస్.ఎమ్. మలిక్

అసోసియేట్ ఎడిటర్
అబ్దుల్ వాహెద్

ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి
ముహమ్మద్ ముజాహిద్

సబ్ ఎడిటర్
యాఖూబ్ షర్ఫీ

గ్రాఫిక్స్
ఎల్. లక్ష్మీనారాయణ
ముహమ్మద్ రఫీఖ్

సర్క్యులేషన్ మేనేజర్
అబ్దుల్ జలీల్, 9704317015

సేల్స్ మేనేజర్
ముహమ్మద్ యాసీన్, 9700255736

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com





భారత రైతుకు భరోసా ఏదీ?

## లోపల...


| | | |
|---|---|---|
| మైనారిటీ హక్కులపై మరో దాడి | ...... | 05 |
| కరోనా..2020 | ...... | 06 |
| చరితార్థులు – మాలిక్ ముహమ్మద్ యూనుస్ | ...... | 09 |
| బలమైన కుటుంబం... బలమైన దేశం | ...... | 10 |
| విశ్వాసుల మాత సయ్యిదా ఆయిషా (ర.అ) – 29 | ...... | 12 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| కంటిచూపును కాపాడుకోవాలి | ...... | 20 |
| మెటర్నిటీ దవాఖాన | ..... | 22 |
| ఆ లోకంలో తీసుకెళ్ళండి | ...... | 24 |
| క్యాలెండర్ మారింది... జీవితం మారిందా? | ...... | 26 |
| దీపమున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకో | ...... | 28 |
| సుఖాలను త్యజించనవసరం లేదు! | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| విద్యాజ్ఞానాలను కూడా ఖుర్ఆన్ కట్టిపడేస్తుంది | ...... | 34 |


**పొమ్మనలేక పొగ బెట్టినట్లు..**



చర్చల పేరు మీద
సాగదీత నాటకం
చిత్తశుద్ధి లేదోయి
అంతా ఒక బూటకం!
రైతులపై లేదట
సర్కారుకు ఏ పగ
పొమ్మనలేక మరి
పెడ్తున్నరు పొగ!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్




గతవారం 'గీటురాయి' సంచిక బాగుంది. ప్రతీ వారం కవరు కథనాలు సమకాలీన అంశాలు కళ్లకు కడుతున్నాయి. 'అలీగఢ్ లో మోడీ' ప్రసంగం విశ్లేషణ బాగుంది. ముస్లిముల విద్యాభివృద్ధికోసం స్థాపించబడ్డ అలీగఢ్ యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం నిజంగా హర్షణీయం. అనేక మంది మేథావులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల, మేథావులను అందించిన ఆ యూనివర్సిటీ స్థాపకుల సంకల్పం ఎంత గొప్పదో అర్థమవుతుంది. అయితే యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోడీ చెప్పిన డాంభికాలను ఎవ్వరూ నమ్మేస్థితిలో లేరు. గత ఆరేళ్ల పాలనకూ, ఆయన చెప్పిన మాటలకు పొంతన కుదరడం లేదు. చెప్పేటందుకే నీతులున్నాయని మోదీ మాటల ద్వారా స్పష్టమవుతుంది. యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు చేసిన అకృతాలను ఏ ఒక్క విద్యార్థీ మరిచిపోలేడు. గత డిసెంబర్‌లో విద్యార్థులు నిరసనల్లో, ఈ ఏడాది రైతులు నిరసనల్లో ఉన్నారు. ఆనాడు ఎంతోమందిని ప్రభుత్వం జైళ్లల్లో నిర్బంధించింది. ప్రస్తుతం జరుగుతున్న రైతుల నిరసనల్లో ఎందరో అన్నదాతలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎముకలు కొరికే డిసెంబర్ చలిలో ప్రాణాలు కోల్పోతున్న రైతుల జీవితాలకు పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలి. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్ మాటల్లో కాకుండా చేతల్లో చూపించినప్పుడే ప్రజలు నమ్ముతారు. **- రేష్మా, ఖమ్మం**

పోయిన ప్రాణాన్నీ, కరిగిపోయిన కాలాన్ని ఎవ్వరూ తిరిగి తీసుకు రాలేరు అన్న విషయాన్ని గతవారం సంచికలో అబ్దుల్ బాసిత్ గారు చక్కగా విశ్లేషించారు. ఏడాది కాలం ముగుస్తున్న సందర్భంగా ఆయన అందించిన వ్యాసం ఆలోచింపజేసింది. కాలం గురించి ఖుర్ఆన్ చెప్పిన మాటలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. 'ప్రపంచం వెనుతిరిగి వెళ్లిపోతోంది. ప్రళయం వేగంగా ముందుకు వస్తుంది' అన్న ప్రవక్త హెచ్చరిక ఎవ్వరూ కొట్టిపారేయలేనిది. ఐదు విషయాలకు పూర్వం ఐదు విషయాలను మేలైనవిగా భావించాలి అన్న విషయాలు ప్రతి ఒక్కరూ పరిగణలోకి తీసుకుంటే వైఫల్యాలు దరిచేరవు. 'కాలబోధిని' వ్యాసం కూడా కాలం మహత్యాన్ని వివరించింది. 'కాలాన్ని పుట్టించిన వాడికి కాస్త సమయమిచ్చి చూడండి, మీ జీవిత ఘడియలు ఎలా మారతాయో చూస్తారు' వాక్యాలు నూటికి నూరుపాళ్లు నిజం. **- అహ్మద్, కాకినాడ**

ఫ్రీడమ్ ఫైటర్.. ముహమ్మద్ అలీ జౌహర్' స్ఫూర్తిదాయకంగా ఉంది. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని గుండెల్లో నింపుకుని మౌలానా చూపిన తెగువ, ధైర్యసాహసాలు అసామాన్యం. కవిగా, రచయితగా, జర్నలిస్టుగా, ఉద్యమ నాయకుడిగా ఆయన ప్రదర్శించిన బహుముఖ పాత్రలు చదివి ఆశ్చర్యపోయాము. ఇన్నిన్ని త్యాగాలు చేసిన మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్ గురించి ఆయన జయంతి సందర్భంగా విస్తృత ప్రచారం చేయాలి. నేటి యువతరానికి ఆయన జీవిత ఆదర్శాలను పరిచయం చేయాలి. మంచి వ్యాసాన్ని అందించిన ముహమ్మద్ ముజాహిద్ గారికి ధన్యవాదాలు. ముస్లిమ్ మహనీయుల గురించి మరిన్ని వ్యాసాలు ఆయన కలం నుండి రావాలని కోరుకుంటున్నాము.

**- షేక్ హసన్ సాహెబ్, అన్నవరం**

పెళ్లి చేయాలంటే డబ్బు కాదు అమ్మాయి అంగీకారం కావాలి. కానీ మన సమాజంలో పెళ్లంటే డబ్బుతో ముడిపడి ఉంది. 'పెళ్లిళ్లను సులభతరం చేయండి' అన్న ముహమ్మద్ ప్రవక్త సూక్తి ప్రచారంలో పెట్టాల్సిన సమయం ఇంకా రాలేదా? ముస్లిమ్ సమాజం ఈ పనికి పూనుకోవాలి. హైదరాబాద్‌లో డాక్టర్ అలీం ఖాన్ ఫల్కి ఈ ఉద్యమానికి పూనుకున్నారు. వరకట్న దురాచారంపై ఉద్యమ స్థాయిలో పనిచేస్తున్నారు. మగ పిల్లల తల్లి దండ్రుల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. పెళ్లిళ్లలో అమ్మాయి తండ్రికి భోజనాల ఖర్చు భారం కూడా లేకుండా చైతన్యం తీసుకువస్తున్నారాయన. 'షాదీ వలీమా' ఒకేరోజు జరిపేలా యువకులను ప్రోత్సహిస్తున్నారు. వరకట్నం తీసుకోకుండా చేసే పెళ్లిళ్లకు ఉచితంగా ఫంక్షన్ హాల్ సౌలభ్యం కల్పిస్తున్నారు. కట్నకానుకలు తీసుకోకుండా వివాహాలు జరిపించే తల్లులకు సన్మాన కార్యక్రమాలూ చేపట్టారు. వరకట్న దుర్మార్గాలు, దుష్ప్రభావాలపై సోషల్ మీడియాలో లఘుచిత్రాల ద్వారా చైతన్యం తీసుకువస్తున్నారు. ఒక్క ముస్లిమ్ సముదాయంలోనే కాకుండా అన్ని మతాల వారూ ఈ తరహా చైతన్యం తీసుకువస్తే చాలా వరకు వరకట్న హత్యలను తగ్గించవచ్చు. పెళ్లంటే అమ్మాయి తల్లిదండ్రులకు భారం కాదనే చైతన్యాన్ని తీసుకురావచ్చు. అన్ని మత వర్గాలలోని ధార్మిక పెద్దలు ఈ పనికి పూనుకోవాలి. **- షేక్ ఇస్లామ్, ఆరుగొలను**

ఆలోచన

# మైనారిటీ హక్కులపై మరో దాడి

**అస్సాం ప్రభుత్వం** రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో నడిచే మదరసాలు, సంస్కృత పాఠశాలలను మూసివేస్తూ చట్టం చేసింది. అస్సాం విద్యామంత్రి సెక్యులరిజాన్ని నిలబెట్టడానికే ఈ పని చేశామని అంటున్నారు. ప్రతిపక్షాలు తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేసినా చట్టాన్ని మెజారిటీ బలంతో ఆమోదించుకున్నారు.

ప్రజాధనంతో మతపరమైన విద్యాబోధనకు ఒప్పుకోమని విద్యామంత్రి హేమంతబిశ్వా శర్మ అన్నారు. మదరసాలతో పాటు సంస్కృత పాఠశాలలను కూడా మూసేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ వాస్తవం అది కాదు. సంస్కృత పాఠశాలలన్నింటిని కుమార భాస్కర వర్మ సంస్కృత్ అండ్ యానిషెంట్ స్టడీస్ యూనివర్శిటీ పరిధిలో చేర్చారు. మదరసాలను మాత్రం మూసేశారు.

కాంగ్రెసు, ఏఐయుడిఎఫ్ తదితర ప్రతిపక్షాలు ఈ చర్యను తీవ్రంగా నిరసించాయి. ఈ సంవత్సరం అస్సాంలో ఎన్నికలు జరగవలసి ఉంది. ప్రజల్లో మతపరమైన చిచ్చు పెట్టడానికే ఈ చట్టం చేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. గతంలో హేమంత బిశ్వ శర్మ ఈ ఎన్నికలు అస్సాం సంస్కృతిని కాపాడే పోరాటంగా మారతాయని చెప్పి ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అస్సాంలో హిందువులు 61.47శాతం, ముస్లిములు 34.22 శాతం ఉన్నారు. శర్మ ఈ జనాభా వివరాలనే సూచిస్తూ 60శాతానికి పైబడిన మెజారిటీ ప్రజలు సంస్కృతిని కాపాడ్డానికి పోరాడతారన్నారు. బీజేపీ నేతలు అనేక సందర్భాల్లో ముస్లిములను పరాయి వారిగానే మాట్లాడారు. పరాయి ఇస్లామీయ సంస్కృతిని తీసుకొచ్చారని ఆరోపించడం కూడా చాలా సార్లు చేశారు. మదరసాలపై అనుమానాలు ప్రచారం చేయడం కూడా చాలా కాలంగా జరుగుతూ వస్తున్నదే. టెర్రరిజానికి అడ్డాలుగా వర్ణించడం కూడా జరిగింది. ఉత్తరప్రదేశ్‌లో యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం మదరసాలకు ప్రత్యేకంగా నిర్దేశాలు జారీ చేస్తూ జాతీయపతాకం ఆవిష్కరించాలని చెప్పడం కూడా ఇలాంటిదే. ప్రత్యేకంగా మదరసాలకు చెప్పడంలోనే అసలు బుద్ధి బయటపడింది. నిజానికి భారత జాతీయపతాకాన్ని చాలా కాలం ఒప్పుకోని ఆరెస్సెస్ నడిపే ఏకల్ అభియాన్, విద్యాభారతి విద్యాసంస్థల విషయంలో ఇలాంటి నిర్దేశాలు ఎందుకు జారీ కాలేదు?

ఈ వివక్ష నరనరాల్లో జీర్ణించుకుపోయినట్లు కనిపిస్తోంది. దేశంలో ముస్లిములు అడుగడుగునా తమ దేశప్రేమను నిరూపించుకోవలసిన పరిస్థితులు సృష్టిస్తున్నారు. అస్సాంలో మదరసాలను రద్దు చేస్తూ చేసిన చట్టం నిజానికి నూతన విద్యావిధానంలోని ఇండాలజీకల్ ప్రాజెక్టులో భాగమని కొందరు భావిస్తున్నారు. ప్రాచీన హిందూ నాగరికతను ప్రోత్సహించడానికి ఉద్దేశించింది ఇండాలజీకల్ ప్రాజెక్టు. మదరసాలకు సంబంధించి ఆధునీకరించాలనే వాదన కూడా చాలా మంది చాలా సార్లు చేస్తూ వచ్చారు. ముస్లిముల పిల్లలంతా మదరసాల్లోనే చదువుతారన్నట్లు వీళ్లు మాట్లాడుతుంటారు. సచార్ కమిటి నివేదిక ఇందులో వాస్తవమెంత ఉందో బట్టబయలు చేసింది. కేవలం 4 శాతం ముస్లిం పిల్లలు మాత్రమే మదరసాల్లో చదువుతున్నారు. అయినప్పటికీ మదరసాల ఆధునికీకరణ, మదరసాలను ప్రధానస్రవంతిలో కలపడం వంటి మాటలన్నీ కేవలం ముస్లిములను పరాయీకరించే భావజాలాన్ని ప్రచారం చేసే వ్యూహాలు మాత్రమే.

ముస్లిం ప్రాంతాల్లో కనీస విద్యావసతులు కల్పించడంలో విఫలమైన వివిధ ప్రభుత్వాలు మదరసాల ఆధునికీకరణ గురించి చాలా మాట్లాడాయి. ప్రయివేటు మదరసాలను కూడా రెగ్యులరైజ్ చేసే చట్టం తెస్తామని శర్మ అన్నారు. భారత రాజ్యాంగంలోని అధికరణ 29, అధికరణ 30లను తొలగించాలంటూ విశ్వ హిందూ పరిషద్ కోరుతోంది. ఈ అధికరణలు మైనారిటీలకు వారి సంస్కృతి, భాషలను కాపాడుకునే హక్కు ఇస్తున్నాయి. స్వంత విద్యా సంస్థలను స్థాపించి నడుపుకునే హక్కు కల్పిస్తున్నాయి. మాజీ ప్రధాని వాజపేయి కూడా అధికరణ 30కి వ్యతిరేకంగా గతంలో మాట్లాడారు. అధికరణ 30 హిందువులకు కూడా వర్తింపజేయాలని కోరారు.

ప్రస్తుతం ఈ చట్టాన్ని కోర్టులో సవాలు చేయడానికి అస్సాంలో ముస్లిం సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఈ కేసులు అనేక రాజ్యాంగపరమైన సమస్యలను సృష్టించవచ్చు. అధికరణ 29, అధికరణ 30లను సవరించడానికి మోడీ ప్రభుత్వం ఇంతవరకు ప్రయత్నించలేదు. కాని అలీగఢ్ విశ్వవిద్యాలయం మైనారిటీ హోదాను సెంట్రల్ ఎయిడ్ పేరుతో సవాలు చేశారు.

అస్సాంలో మదరసాలకు వ్యతిరేకంగా చేసిన చట్టం దేశంలో మైనారిటీ హక్కులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో పరిశీలించవలసిన అవసరం ఉంది. సెక్యులరిజం పేరుతో, ఆధునికీకరణ పేరుతో మదరసాలపై జరుగుతున్న దాడుల వెనుక నిజానికి మతతత్వం పనిచేస్తోంది.

**కవరు కథనం** | **అబ్దుల్ వాహెద్**




**2020 -** ఈ సంవత్సరం ఎంత త్వరగా వెళ్ళిపోతుందా అని చాలా మంది ఎదురు చూశారు. బహుశా ఒక సంవత్సరం ఎప్పుడు ముగుస్తుందా అని గతంలో ఇలా ఎదురు చూసిన ఉదాహరణ మరొకటి లేదు. కాని, ట్వంటి ట్వంటి ఒక పేరు మాత్రమే. కాలం ప్రవాహంలో ఒక భాగానికి మనం పెట్టుకున్న పేరు. అంతకు మించి ఏమీ కాదు. కాలంలో ఏ ఘడియ అయినా సరే అది దైవం సృష్టించింది మాత్రమే. అందులో మంచి చెడులేమి ఉండవు. దివ్యఖుర్ఆన్ అస్ర్ సూరాలో ఇలా ప్రకటించింది, "కాలం సాక్షిగా! నిస్సందేహంగా మానవుడు పెద్ద నష్టానికి గురిఅయి ఉన్నాడు. విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉండేవారూ, ఒకరికొకరు సత్యోపదేశం, సహన బోధ చేసుకునేవారూ తప్ప"

ఈ సంవత్సరం ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన ఒకే ఒక్క సంఘటన-కోవిడ్ 19. యావత్తు ప్రపంచాన్ని గడగడలాడించింది. కాలం ఒక్కసారిగా ఆగిపోయిందా అనిపించింది. లాక్‌డౌన్లతో మానవకార్యకలాపాలన్నీ స్తంభించాయి. ఈ సంవత్సరం తర్వాత మానవ జీవితమే మారిపోయింది. జీవనశైలిలో మార్పులు వచ్చేశాయి. జీవితంలోని ప్రతి రంగం ఈ ప్రభావానికి గురయ్యింది. ఇక జీవనశైలి గతంలో మాదిరిగా ఉండడం సాధ్యం కాకపోవచ్చు.

ముట్టుకోకుండా ఎలా మాట్లాడను అని శివారెడ్డి ఒక కవితలో రాస్తారు. కరచాలనాలు, ఆలింగనాలతో ఆత్మీయత ప్రదర్శించే కాలం గతించింది. నిత్యజీవితంలో సురక్షిత దూరాన్ని పాటించడం ఇప్పుడు అలవాటుగా మారిపోయింది. రొటీన్ జీవితంలో గతంలో మాదిరిగా రాసుకుపూసుకు తిరిగే వాతావరణం ఇప్పుడు లేదు. సేఫ్ డిస్టెన్స్ అనేది అలవాటుగా మారిపోయింది. ఉద్యోగాలు చేసే పరిస్థితి కూడా మారింది. కార్యాలయాలకు వెళ్ళడం తప్పనిసరి అవసరం కానట్లయితే, ఇంటిలోనే కంప్యూటరు ముందు కూర్చుని వర్క్ ఫ్రం హోం చేయడం ఇప్పుడు ఎక్కువయ్యింది. సభలు, సమావేశాలు అన్నీ ఇప్పుడు గతమయ్యాయి. జూమ్ వంటి యాప్‌ల ద్వారా వర్చువల్ సమావేశాలు, వర్చువల్ కార్యక్రమాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. పెళ్ళిళ్ళకు వందలాది వేలాది మందిని ఆహ్వానించే కాలం ఇప్పుడు లేదు. కేవలం కొద్దిమంది

బంధువులు మిత్రుల సమక్షంలో జరిగిపోతున్నాయి. ప్రతి కార్యక్రమం ఇంటర్నెట్ ద్వారా అందరూ చూస్తున్నారు. చరిత్రలో ఇది కొత్త మలుపు. కమ్యూనికేషన్ విప్లవం తర్వాత ప్రతి ఒక్కరి చేతుల్లోకి మొబైల్ ఫోను వచ్చినప్పుడు చరిత్ర కొత్త మలుపు తిరిగిందనుకున్నాము. నిజానికి కరోనా తర్వాత చరిత్ర అంతకన్నా పెద్ద మలుపు తిరిగింది. గత అలవాట్లు అన్ని ఇప్పుడు చరిత్ర గర్భంలో కలిసిపోయాయి.

ఇది కేవలం ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాదు, చదువులు కూడా ఇప్పుడు ఇంటిలో కూర్చునే జూమ్ తదితర యాప్‌ల సహాయంతో కాలు బయటకు కదపకుండా ఇంటిలోనే పాఠాలు చదువుకునే కొత్త పరిస్థితి వచ్చింది. అధ్యాపకుడికి, విద్యార్థికి మధ్య ఇప్పుడు ప్రత్యక్ష సంబంధం లేదు. అంతా వర్చువల్ తరగతుల్లోనే బోధన. ఈ వాతావరణం బడుగు బలహీనవర్గాల పిల్లల చదువులపై ఎలాంటి ప్రభావం వేస్తుంది? బీద ధనిక వ్యత్యాసాన్ని ఇది ఇంకా ఎంత పెంచుతుందన్నది భవిష్యత్తే చెప్పాలి.

కరోనా నేర్పిన మరో ముఖ్యమైన పాఠం - లాక్‌డౌన్ చాలా మందికి కర్ఫ్యూ కష్టాలు ఎలా ఉంటాయో తెలిసేలా చేసింది. లాక్‌డౌన్ వల్ల ఇంట్లోనే ఉండవలసి వస్తే ఆ పరిస్థితి ఎలా ఉంటుందో ఎన్నడూ ఆ పరిస్థితి చవిచూడని ప్రాంతాల ప్రజలు కూడా అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. మానవీయ ప్రతిస్పందనకు ఇది సహకరిస్తుందని ఆశించ వచ్చు. అలాగే కరోనా నేర్పిన మరో పాఠం మనిషి ఎంత సమయాన్ని వ్యర్థం చేస్తున్నాడో తెలుసుకునే అవకాశం కల్పించడం. ఎంత సమయం మనం పార్టీల్లో గడిపేశామో, ఎంత సమయం అనవసరపు కార్యకలాపాల్లో గతంలో వ్యర్థంగా గడిపేవారమో ఇప్పుడు తెలుసుకునే అవకాశం లభించింది. ఆ సమయాన్ని నిర్మాణాత్మక, ఉత్పాదక కార్యకలాపాలకు ఉపయోగించే కొత్త అలవాట్లకు కరోనా కారణమయ్యింది. మానవ విలువలను కూడా కరోనా నేర్పింది. ఆకలికి అలమటిస్తూ వందలాది కిలోమీటర్లు నడిచి వెళుతున్న వలసకూలీలను ఆదుకోడానికి కరోనాను కూడా లక్ష్యపెట్టక ముందుకొచ్చి సేవలందించిన వారి మానవ ప్రేమ ప్రపంచానికి తెలిసింది. మానవప్రేమికులు సమాజంలో చాలా మంది ఉన్నారన్న వాస్తవాన్ని కరోనా తెలియ జేసింది.

వ్యాపార వాణిజ్య సంస్థలు కొత్త పద్ధతులు, కొత్త పనితీరును అలవర్చుకున్నాయి. భౌతికదూరాలకు సదుపాయాలు కల్పించవలసి వచ్చింది. అవసరమైతే ఇంటివద్దనే పనిచేసే అవకాశాలు కల్పించవలసి వచ్చింది. వాణిజ్యనిర్వహణలో కొత్త ఆలోచనలకు ఇది దారితీసింది. అనవసరమైన ఇన్‌ఫ్రాస్టక్చర్, ఉద్యోగుల రవాణా సదుపాయాలు, సెమినార్లు, ఎగ్జిబిషన్లు మొదలైన వాటికి పెట్టే ఖర్చును తగ్గించవచ్చనే కొత్త ఆలోచనలు మొదలయ్యాయి. వాటికి బదులుగా కొత్త పద్ధతులతో మంచి ఫలితాలు సాధించవచ్చని అనుభవపూర్వకంగా తెలుసుకునేలా చేసింది కరోనా. ఉద్యోగుల పనితీరుపై కూడా దీని ప్రభావం పడింది. ఇంటివద్దనే పని సదుపాయం వల్ల ప్రయాణాల సమయం కలిసివచ్చింది. కుటుంబంతో ఎక్కువ సమయం గడిపే అవకాశం లభించింది. కుటుంబ బంధాలు దీనివల్ల బలపడ్డాయా?

కొన్ని కుటుంబాల్లో కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు మరింత బలపడ్డానికి ఇది కారణమైతే, చాలా కుటుంబాల్లో దీనివల్ల గృహహింస పెరిగింది. లాక్‌డౌన్ వల్ల జీవనోపాధి కోల్పోయిన కుటుంబాల్లో పూటగడవడం కష్టమైన తర్వాత, విసుగు ఆగ్రహాలు పిల్లలపై తల్లిదండ్రులు చూపించడం, భార్యపై భర్త చూపించడం ఎక్కువయ్యింది. కుటుంబ విలువలు, కౌటుంబిక సంబంధాల్లో ఆర్థికవ్యవహారాలు ఎంత కీలకమైనవో దీనివల్ల స్పష్టంగా అర్థమవుతోంది. అంతే కాదు, కుటుంబంలో అనుబంధాలు బలంగా లేకపోతే ఎంత సులభంగా కుటుంబం కకావికలమవుతుందో కూడా దీనివల్ల స్పష్టంగా తెలుస్తోంది. కాని ఇక్కడ కూడా బీద ధనిక వ్యత్యాసం మనకు కనబడుతుంది. ఆర్థికంగా పటిష్టమైన స్థాయిలో ఉన్నవారు లాక్‌డౌన్ కాలాన్ని కుటుంబంతో హాయిగా గడపగలిగారు. కాని, రోజువారి సంపాదనపై ఆధార పడిన కుటుంబాలు దిక్కులేనివయ్యాయి. భర్తల ఆగ్రహాలను భార్యలు, తల్లిదండ్రుల కోపాన్ని పిల్లలు భరిస్తూ గడప వలసి వచ్చింది.

నాణేనికి రెండు పార్శ్వాలు ఉంటాయి. కరోనా రెండు పార్శ్వాలను కూడా చూడడం అవసరం. కరోనా సృష్టించిన సంక్షోభంలో వలసకూలీల పట్ల మానవీయంగా చాలా మంది ప్రతిస్పందిస్తే మరోవైపు కరోనా ప్రారంభం కాక ముందు తబ్లీగ్ జమాఅత్ ఇజ్తిమా జరగడం, దాన్ని కరోనాతో ముడి

పెట్టడం, చివరకు ముస్లిములు కరోనా వ్యాపింపజేస్తున్నారనే వదంతులు ప్రచారంలోకి రావడం అందరికీ తెలిసిందే. విద్వేషాన్ని రెచ్చగొట్టే శక్తులు ప్రతి విషయాన్ని తమకు అనుకూలంగా ఎలా మార్చుకుంటాయో చెప్పడానికి ఒక ఉదాహరణగా కరోనా మారింది. స్వతహాగా మతవిద్వేషం లేనివారు కూడా ఎందుకైనా మంచిదన్నట్లు ముస్లిముల పట్ల అనుమానంతో వ్యవహరించడం చూస్తే, భయం ఎలాంటి మనస్తత్వాన్ని సృష్టిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఏది ఏమైనా మతవిద్వేషశక్తుల డిక్షనరీలో కరోనా జిహాద్ అనే కొత్త పదం వచ్చింది. ఇప్పుడు ఎవరూ కరోనాకు ముస్లిములే కారణమని చెప్పకపోయినా... కరోనా కొత్త స్ట్రెయిన్ విషయంలో ఇప్పటి వరకు అలాంటి మాటలేవీ వినబడకపోయినా.. భవిష్యత్తులో మతవిద్వేష శక్తులు ఈ భయాన్ని మతం చిచ్చును రాజేయ డానికి చాలా సులభంగా వాడుకోవచ్చనే వాస్తవం అందరికీ అర్థమయ్యేలా చేసింది కరోనా.

కరోనా వల్ల ప్రపంచం ఒక్కసారిగా ఆగిపోయిందనే చెప్పాలి. ఆగి కాస్త ఆలోచించే అవకాశం కూడా లభించింది. మార్చి 2020 తర్వాతి నుంచి కరోనా తన ప్రతాపం చూపిస్తూనే ఉంది. లాక్‌డౌన్ వల్ల అనేకమంది జీవనోపాధి కోల్పోయారు. రవాణా సదుపాయాలు స్తంభించాయి. పరిశ్రమలు ఆగిపోయాయి. ఫలితం, ఢిల్లీ వంటి వాయు కాలుష్యం ఉన్న నగరంలో వాయుకాలుష్యం తగ్గిందనే శుభవార్తలు వచ్చాయి. కాలుష్యాన్ని కరోనా తగ్గించడం ఒక విచిత్రమైన పరిస్థితి. ఎందుకంటే కాలుష్యం లేని ఈ స్వచ్ఛమైన గాలుల తాజాదనాన్ని అనుభవించే స్థితిలో పేదలు లేరు.

వాతావరణం బాగుపడింది. నదుల్లో కాలుష్యం తగ్గింది. కాన్పూర్ వారణాసి నగరాల్లో గంగా నది జలాలు శుభ్రపడినట్లు వార్తలు కూడా అప్పట్లో వచ్చాయి. సాధారణంగా పొగతో నిండి ఉండే ఆకాశం స్వచ్ఛమైన నీలిరంగుకు మారింది. దూరం నుంచి హిమాలయాలను చూసే అదృష్టం మరోసారి కలిగింది. నిజం చెప్పాలంటే భూమి కాలుష్యాన్ని వదిలించుకునే ఒక అవకాశాన్ని ప్రకృతి కల్పించిందా అనిపించింది. మనుషులు కూడా కాస్త నిలబడి ఆలోచించే అవకాశం కల్పించింది. రోజువారి పరుగుల బతుకులో కాస్త నిలబడే సమయం లభించినప్పుడు ఆలోచించవలసింది... అసలు మనిషి ఎవరు? అనే ప్రశ్న గురించి. ఆధ్యాత్మిక విషయాల గురించి ఆలోచించే తీరిక ఇంతకు ముందు మనిషికి ఎప్పుడూ లభించలేదు. ఇప్పుడు అవసరమైనంత తీరిక లభించింది. కేవలం ఆధ్యాత్మికత అంటే ప్రార్థనలు, ఉపవాసాలు మాత్రమే కాదు. మన ఉనికి గురించిన ప్రశ్నలు. సమాజశ్రేయం గురించిన ప్రశ్నలు. మనిషిగా మన బాధ్యతలు, కర్తవ్యాల గురించిన ప్రశ్నలు.

లాక్‌డౌన్ కాలంలో ఆర్థికంగా స్థోమత ఉన్నవారు లాక్‌డౌన్ కుటుంబంతో గడుపుతున్నప్పుడు స్థోమత లేనివారు ఎలా బతుకుతున్నారన్నది ఆలోచించారా? రమజాన్ ఉపవాస కాలంలో ఆకలిదప్పులను భరించిన వారికి తోటివారి ఆకలి తప్పకుండా తెలుస్తుంది. కడుపులో పేగులను మెలితిప్పే ఆకలి బాధ ఎలాంటిదో తెలిసినప్పుడు చిన్న చిన్న పిల్లల ఆకలి కన్నుల భాషను తప్పక అర్థం చేసుకుంటారు. తోటివారి ఆకలిని అర్థం చేసుకున్న వారు తమ సంపద నుంచి తప్పక ఇస్తారు.

"వారు అల్లాహ్‌కు దాస్యం చెయ్యాలని, పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని, నమాజ్‌ను స్థాపించాలని, జకాత్ ఇస్తూ ఉండాలని మాత్రమే ఆదేశించటం జరిగింది." (దివ్యఖుర్ఆన్ 98:5)

"అల్లాహ్ తన అనుగ్రహాన్ని విరివిగా ప్రసాదించినప్పటికీ పిసినారితనం చూపేవారు, ఈ పిసినారితనం తమకు మేలైనదని భావించరాదు. కాదు, ఇది వారికొరకు ఎంతో హానికరమయినది. వారు తమ లోభత్వంతో కూడబెడుతూ ఉన్నదే ప్రళయంనాడు వారి పాలిట కంఠపాశం అవుతుంది." (దివ్యఖుర్ఆన్ 3:180)

దైవం మనిషి ఎలా ఉండాలని చెప్పాడు. మనం ఎలా జీవిస్తున్నాం. సమాజం నుంచి మనం ఏం తీసుకుంటున్నాం. సమాజానికి మనం ఏమిస్తున్నాం వంటి ప్రశ్నలపై ఆలోచించేలా చేసింది కరోనా.

కరోనా తర్వాత మారిన ఆలోచనల్లో పారిశుధ్యం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇప్పుడు శానిటైజేషన్ గురించి ప్రతి ఒక్కరు ఆలోచిస్తున్నారు. పరిశుభ్రత సగం ధార్మిక విశ్వాసం అని నమ్మేవారు కూడా నిన్నటి వరకు నిర్లక్ష్యంగానే వ్యవహరించారు. ఇప్పుడు అందరూ దీన్ని పాటిస్తున్నారు. నిజం చెప్పాలంటే కరోనా వైరస్ కమ్యునిస్టు, కేపిటలిస్టు అనే తేడా లేకుండా అన్ని సమాజాలను ప్రభావితం చేసింది. ప్రాధాన్యతల క్రమాన్ని మార్చేసింది. కొత్త ఆలోచనలకు తలుపులు తెరిచింది. సమాజంలోని అనేక చేదువాస్తవాలను కళ్ళకు కట్టినట్లు చూపించింది. గుణపాఠాలు గ్రహిస్తామా లేదా అన్నది మన చేతుల్లో ఉంది. ✤

‘చరితార్థులు’

# మాలిక్ ముహమ్మద్ యూనుస్

66

## (1884-1952)



**బీహార్ రాష్ట్రం** ప్రథమ ప్రధాన మంత్రిగా ఎన్నికై చరిత్ర సృష్టించిన మాలిక్ ముహమ్మద్ యూనుస్ బీహార్ రాష్ట్రం పనేహార్ గ్రామంలో 1884 మే నాల్గున జన్మించారు. ఆయన తండ్రి ప్రఖ్యాత న్యాయవాది మౌల్వీ అలీ హసన్ ముఖ్తార్. మాలిక్ మొహమ్మద్ యూనుస్ పాట్నా కళాశాలలో విద్యానంతరం 1903లో ఇంగ్లాండ్ వెళ్ళి న్యాయశాస్త్రం అభ్యసిస్తూ, జర్నలిస్టుగా కూడా రాణించారు. 1906లో న్యాయవాదిగా ఇండియా తిరిగి వచ్చి కలకత్తాలో ప్రాక్టీస్ ఆరంభించారు. 1906లో కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో పాల్గొనడం ద్వారా ఆయన రాజకీయరంగ ప్రవేశం చేశారు. 1908లో లాహోర్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ జాతీయ సమావేశాల్లో ప్రముఖ పాత్రవహించారు. అఖిల భారత ముస్లింలీగ్‌లో కూడా సభ్యులయ్యారు. ముస్లింలీగ్ కార్యదర్శి పాత్రను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొహమ్మద్ యూనుస్ అందించిన సూచనలు ‘మింటో–మార్లి’ సంస్కరణలలో చోటు చేసుకున్నాయి. పలు సేవా కార్యక్రమాలతో ప్రజల అభిమానాన్ని చూరగొన్న ఆయన పాట్నా నగరపాలక సంస్థలో ప్రజాప్రతినిధిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రజోపకరమగు పలు పథకాలకు రూపకల్పన చేశారు. ఇంపీరియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి పోటీచేసి విజయం సాధించిన మాలిక్ మొహమ్మద్ యూనుస్ 1921లో బీహార్–ఒరిస్సా ప్రోవిన్షియల్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. 1924లో ఆయన ప్రారంభించిన ‘పాట్నా టైమ్స్’ వారపత్రిక అతి త్వరలో దినపత్రికగా మారి ప్రజా సమస్యల ప్రతిబింబంగా ప్రజాదరణ పొందింది. ముస్లిం లీగ్ రాజకీయాలు నచ్చని ఆయన 1936లో స్వయంగా ‘బీహార్ ముస్లిం ఇండిపెండెంట్ పార్టీ’ని స్థాపించారు. ఆ పార్టీని ముస్లింలీగ్‌లో విలీనం చేయాల్సిందిగా ముహమ్మద్ అలీ జిన్నా సలహాను తిరస్కరించారు. 1937లో జరిగిన ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్‌తో కలసి ‘బీహార్ ముస్లిం ఇండిపెండెంట్ పార్టీ’ ముస్లింలకు రిజర్వు చేయబడిన 40 సీట్లల్లో 15 సీట్లను సాధించుకుని భారత జాతీయ కాంగ్రెస్ తరువాత రెండవ పెద్ద పార్టీగా అవతరించింది. భారత జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు తిరస్కరించడంతో మాలిక్ ముహమ్మద్ యూనుస్ ముందుకు వచ్చి బీహార్ తొలి ప్రీమియర్ (ప్రధాన మంత్రి)గా 1937 ఏప్రిల్ ఒకటిన బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిచ్చింది. ఉర్దూ భాషను అధికారిక భాషగా ప్రకటించింది. ప్రధాన రాజకీయపక్షాల సహాయనిరాకరణ, మత తత్త్వశక్తుల ప్రతిఘటన మూలంగా ‘బీహార్ ముస్లిం ఇండిపెండెంట్ పార్టీ’ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం 1937 జూలై 19న రద్దయ్యింది. 1921 నుండి 1945 వరకు బీహార్–ఒరిస్సా ప్రోవిన్షియల్ కౌన్సిల్‌కు నిరాటంకంగా ఎన్నికవుతూ వచ్చారు. పలు సామాజిక సేవా సంస్థలకు, వ్యవస్థలకు సేవలందిస్తూ ‘థియోసాఫికల్ సోసైటీ’, ‘మేల్ మిలాప్ అసోసియేషన్’ బాధ్యతలు స్వయంగా నిర్వహించారు. అనారోగ్య కారణాల మూలంగా పూర్తిగా విశ్రాంతి తీసుకుంటూ కవిగా కూడా రాణించిన మాలిక్ ముహమ్మద్ యూనుస్ 1952 మే 13న లండన్‌లో కన్ను మూశారు. ✤



✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ ‘చరితార్థులు’ (తెలుగు) ‘ది ఇమ్మోర్టల్స్’ (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# బలమైన కుటుంబం... బలమైన దేశం

- ముహమ్మద్ ముజాహిద్



**మానవ సమాజ** నిర్మాణంలో కుటుంబ వ్యవస్థ కీలకమైనది. మనిషి సంఘజీవిగా ఎదగడానికి ఊతమిచ్చే మొట్టమొదటి సామాజిక సంస్థ కుటుంబం. మానవ హక్కులు విచ్ఛిన్నం కాకుండా కాపాడేది కుటుంబ వ్యవస్థే. సమాజంలో సమైక్య తకు కుటుంబం ఒక చిహ్నం. భవనానికి పునాది ఎంత ముఖ్యమో సమాజానికి కుటుంబం అంతే ముఖ్యం. వ్యక్తి వికాసంలో, ఎదుగుదలలో కుటుంబం ఎంతో ప్రముఖ మైనది. కుటుంబం విస్తృత రూపమే సమాజం. భారతీయ సంస్కృతీ సంప్రదాయలకు, నాగరికత పురోగతికి మూల మైనది. కుటుంబ వ్యవస్థ సజావుగా, సాఫీగా సాగాలంటే ఆ ఇంటి వారి మధ్య సత్సంబంధాలుండాలి. మనిషి బ్రతికి బట్టకట్టాలంటే ఆహారం ఎంత అవసరమో మానవ జాతి ఉనికిని కాపాడుకోవాలంటే కుటుంబ వ్యవస్థ కూడా అంతే అవసరం. కుటుంబంలోని వ్యక్తిని తీర్చిదిద్దడంలో కుటుంబ పాత్ర ఎంతో ఉంది. తల్లిదండ్రులు, ఇతర పెద్దలు పిల్లల్ని సక్రమమార్గంలో నడిపించి చక్కదిద్దడానికి అవకాశం ఉంది. కుటుంబం మానవ వనరులను ఉత్పత్తి చేసే గొప్ప సంస్థ. ఓ ఇంట్లో ఎంత మంది సభ్యులు వృద్ధిలోకి వస్తారో సమాజమూ అంతగానే పురోగతి సాధిస్తుంది. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట లభిస్తుంది. వ్యక్తి అభివృద్ధే సమాజాభివృద్ధికి మూలమవుతుంది. కుటుంబ వ్యవస్థలోని సభ్యులు ఎంత వృద్ధిలోకి వస్తారో ఆ సమాజంలోని వ్యవస్థలన్నీ అభివృద్ధిపథంలో పయనిస్తాయి. రాజకీయ, పోలీసు, న్యాయ, ఆర్థిక వ్యవస్థలన్నీ పురోగమనంలో పయని స్తాయి.

ఆధునికయుగంగా భావిస్తున్న నేటి కాలంలో కుటుంబ వ్యవస్థ ఎలా మారిందో పరిస్థితులు కళ్లకుకడుతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాభిమానాలు కొరవడు తున్నాయి. నైతిక సంక్షోభం నేటి కుటుంబ వ్యవస్థను వెక్కిరి

స్తోంది. భౌతికవాదం కుటుంబ గోడలను కూల్చివేస్తోంది. కోవిడ్-19 దీనికి మరింత బలాన్నిచ్చింది. ఈ సంక్షోభం లాక్‌డౌన్‌లో కళ్లముందు కనపడింది. మార్చి నెల నుంచి సెప్టెంబర్ వరకూ నమోదైన గృహహింస కేసులను పరిశీలిస్తే కుటుంబ వ్యవస్థలో ఉన్న లోపాలన్నీ బయటపడ్డాయి. ఈ ఏడు నెలల కాలవ్యవధిలో 13వేల గృహహింస కేసులు నమోదయ్యాయని జాతీయ మహిళా కమిషన్ తేల్చిచెప్పింది. ''ఇంట్లో ఉండండి-సురక్షితంగా ఉండండి'' నినాదం అందరినీ ఇంటిపట్టునే ఉంచింది. అయితే గత పదేళ్లలోనూ నమోదవ్వని కేసులు ఈ ఏడు నెలల వ్యవధిలో నమోద య్యాయన్నది ఓ సర్వే సారాంశం. అయితే బాధితుల్లో కేవలం ఏడు శాతం మంది మాత్రమే గడపదాటి ఫిర్యాదు చేస్తారు. ఇంకా లెక్కకు తేలని కేసులు ఎన్ని ఉన్నాయో? సూటిపోటి మాటలతో, శారీరక దండనతో మహిళలు ఎంతో హింసకు గురయ్యారు. అయితే మగవాళ్లలోనూ గృహహింస బాధితు లున్నారన్న విషయం బహిరంగ రహస్యం. ఇందులో యువ కులూ, వృద్ధులూ ఉన్నారు. మన కుటుంబ వ్యవస్థలో ఉన్న లోపాలను ఈ లాక్‌డౌన్ పరాకాష్టకు చేర్చింది. నేటి యువకులు పెళ్లి, కుటుంబ బాధ్యతల నుంచి తప్పించుకు నేలా వ్యవహరిస్తున్నారు. లివింగ్ రిలేషన్ షిప్, స్వలింగ సంపర్కం లాంటి జాడ్యాలు నేటి యువతరాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయి. దీంతో కుటుంబ వ్యవస్థ అనే నిర్మాణానికి పగుళ్లు వస్తున్నాయి. పిల్లలు ప్రేమానురాగాలకు, వృద్ధులు ఆలనాపాలనలకు దూరమవుతున్నారు. చైల్డ్ కేర్ కేంద్రాలకు, వృద్ధాశ్రమాలకు గిరాకీ పెరిగింది.

కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం కాకుండా కాపాడుకునేందుకు నికాహ్ (పెళ్లి) ఒక్కటే మార్గమన్నది ఖుర్‌ఆన్ సూచన.

పెళ్లిని ఒక బలమైన, దృఢమైన ఒప్పందంగా పేర్కొంటోంది ఇస్లామ్. వ్యక్తి సామాజిక జీవనానికి మూలం అయిన కుటుంబ వ్యవస్థకు పునాది వివాహం. భార్యాభర్తల బంధం కుటుంబ ఉనికికి మూలకారక మవుతుంది. ఆలుమగల మధ్య బంధం ఎంతగా బలపడు తుందో, వారిరువురి మధ్య ప్రేమ, ఆప్యాయత, త్యాగగుణం, ఒకరి పట్ల మరొకరికి ఎనలేని నమ్మకం ఎంతగా బలపడతాయో కుటుంబ వ్యవస్థ అంతగానే బలపడుతుంది. ''ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు - మీరు వారివద్ద శాంతిని పొందటానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజిం చాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.'' *(దివ్యఖుర్‌ఆన్ 30:21)*

పవిత్ర మైన నికాహ్ తంతు ప్రవక్త సంప్రదాయాలకు విరు ద్ధంగా జరుగుతోంది. తప్పుడు పద్ధతుల ద్వారా పెళ్లి జరపడం, యువతుల హక్కులను కొల్లగొట్టడం జరుగు తోంది. మహర్ ధనం చెల్లించకపోవడం, పైగా వధువు తల్లి దండ్రుల నుంచి కట్నకానుకలు ముక్కుపిండి వసూలు చేయడం, అమ్మాయికి ఆస్తి హక్కులో భాగం లేకుండా చేయడం, వరకట్న వేధింపులు వెరసి తలాక్ కేసులు పెరుగుతున్నాయి.

ప్రస్తుత పరిస్థితుల్లో విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం మనందరి కర్తవ్యం. బలమైన కుటుంబ వ్యవస్థను పునర్ నిర్మించుకునేలా సమాజాన్ని చైతన్యం చేయడం ముస్లిములందరి బాధ్యత. బంధాల విలువలను తెలియజేయాలి. కుటుంబ వ్యవస్థ బలహీనపరచడం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజల్లో అవగాహన పెంచాలి. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం ఎంత ముఖ్యమో వివ రిస్తూ ప్రజా చైతన్యం కోసం మనమంతా నడుం బిగించాలి. గతంలో బలంగా ఉన్న మన కుటుంబ వ్యవస్థను తిరిగి పునర్ నిర్మించుకుందాం. కుటుంబ వ్యవస్థను కాపాడుకుంటే మంచి సమాజాన్ని నిర్మించుకోవచ్చు. కుటుంబ సంబంధాలు బలపడితేనే సామాజిక సంబంధాలు బలపడతాయి. జమాఅతె ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఈ సత్ సంకల్పం తోనే ఫిబ్రవరి 19 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా ఓ ఉద్య మాన్ని చేపట్టాలని సంకల్పించింది. ఈ ఉద్యమంలో మీరూ భాగస్వాములు కావాలనుకుంటున్నారా? మీకు రాసే నైపుణ్యం ఉంటే మీ కలాలను కదిలించండి. బలమైన కుటుంబం- బలమైన దేశం అని మీరెలా నిరూపిస్తారో మీ కథలు, కవితలు, వ్యాసాలు, స్ఫూర్తిదాయకమైన కథనాలు గీటురాయికి పంపండి. మీరు పంపిన వాటిని ఫిబ్రవరి 19న విడుదల కాబోయే ప్రత్యేక సంచికలో ప్రచురిస్తాము. ✤



29

# విశ్వాసుల మాత సయ్యిదా ఆయిషా رضي الله عنها

ఉర్దూ మూలం : అల్లామా సయ్యిద్ సులైమాన్ నద్వి (రహ్మ) | తెలుగు రూపం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## జమల్ యుద్ధం

మహనీయ అలీ 700 మందిని తీసుకుని మదీనా నుండి బయలుదేరారు. కూఫాలో 7వేల మంది ఆయనకు తోడ య్యారు. బస్రా చేరుకునే సరికి ఈ సంఖ్య మొత్తం 20 వేలకు చేరింది.

అటు సయ్యిదా ఆయిషా(ర.అ) వెంట 30వేల మంది వరకూ ఉన్నారు. ఇరుసైన్యాలు పరస్పరం ఎదురుపడ్డాయి. ఒకే మైదానంలో వారు తమ తమ గుడారాలు వేసుకున్నారు. ముజిర్ తెగవారు ముజిర్‌కు వ్యతిరేకంగా, అజ్ద్ అజ్ద్‌కు ఎదురుగా, యమనీలు యమనీలకు వ్యతిరేకంగా- ఇలా ప్రతి తెగ వారు తమ తెగకు ప్రత్యర్థిగా కదన రంగంలో ఎదురెదురయ్యారు. అత్యంత హృదయ విదారకమైన దృశ్యం ఏమిటంటే సోదర ప్రేమ, పుత్ర వాత్సల్యం వారి నరనరాన జీర్ణించుకుపోయి ఉన్నప్పటికీ తమ రాజకీయ సిద్ధాంతం ప్రకారం ఒకే తల్లిబిడ్డలు ఒకరు అటూ ఒకరు ఇటూ నిల బడ్డారు. వారిలో ప్రతి ఒక్కరూ తామే సత్యంపై ఉన్నామని భావించారు. సత్యానికి విజయం లభించాలన్న ఆకాంక్ష ఆ క్షణాన సోదర ప్రేమపై ఆధిపత్యం వహించింది.

ఇరుసైన్యాలు పరస్పరం ఎదురెదురయ్యాయి. ప్రతి ముస్లిం హృదయం గాయపడింది. నిన్నటివరకూ శత్రువుపై ఝుళిపిం చబడిన ఖడ్గాలు ఇప్పుడు స్వయంగా సాటి సోదరుల రక్తం చిందించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ దృశ్యాన్ని చూసి మహనీయ జుబైర్(రజి) తల్లడిల్లిన మనసుతో, "ఆహ్! ముస్లింలు తమ బలపరాక్రమాల రీత్యా పర్వతంగా తయా రవగానే పరస్పరం ఢీకొని తుత్తునియలై పోవాలనుకుంటు న్నారు. కడు శోచనీయం" అన్నారు. ఇరువర్గాలలో ప్రతిదీ తానే సత్యంపై ఉన్నాననే గట్టి నమ్మకంతో తన స్థానంనుండి ఒక్క అంగుళం కూడా వెనక్కి తగ్గటానికి సిద్ధంగా లేదు. కూఫాకు చెందిన కొంతమంది తెగల సర్దారులు బస్రాలోని మస్జిద్‌లలోకి వెళ్ళి, ఈ ఉపద్రవానికి దూరంగా ఉండమని బస్రీ తెగల వారిని కోరారు. దానికి సమాధానంగా వారంతా ముక్తకంఠంతో, "ఏమిటీ, మనం విశ్వాసుల మాతను ఒంటరిగా విడిచిపెట్టేద్దామా?" అన్నారు.

అయితే వ్యవహారం యుద్ధం వరకూ రాదన్న నమ్మకం ఇరువర్గాల వారికి ఉంది. ఉభయతారకంగా సంధి జరగ గలదని వారు ఆశించారు. ఒక తెగ నాయకుడు మహనీయ

అలీ (రజి) దగ్గరకు వచ్చి సంధి ప్రతిపాదన చేశాడు. అందుకు ఆయన వెంటనే అంగీకరించారు. అతను అక్కడి నుండి లేచి మహనీయ తల్హా, మహనీయ జుబైర్, సయ్యిదా ఆయిషా (రిజ్వానుల్లాహ్)ల దగ్గరకు వచ్చాడు. “అమ్మా! విశ్వాసుల మాతా! ఈ ఉద్యమం ద్వారా మీరు కోరుకునే దేమిటో సెలవిస్తారా?” అని అడిగాడు. దానికి ఆమె, “ఉస్మాన్ హంతకులను దండించడం, ప్రజలను సంస్కరణా ప్రియులుగా మలచడం” అని సమాధానమిచ్చారు. “అమ్మా! కాస్త ఆలోచించండి. ఐదువందల మందిని శిక్షించటానికి తమరు అయిదు వేల మంది రక్తం ప్రవహింపజేస్తారా? అయిదు వేల మంది రక్తానికి పరిహారంగా వేలాది మంది రక్తం చిందించవలసి ఉంటుంది. ఇది ‘సంస్కరణ’ కాగ లదా?” అని అడిగాడు. అతను అడిగిన తీరు ఎంత అమోఘంగా, అనర్గళంగా ఉందంటే అందరూ అవాక్కయ్యారు. ఎవరి వద్ద కూడా సమాధానం లేకపోయింది. అందరూ సంధి పట్ల తమ సమ్మతిని అభివ్యక్తం చేశారు. అందరూ కలసి పరస్పరం రాజీపడాలని నిర్ణయించుకున్నారు. *(తారీఖె తబ్రీ- 6వ సంపుటం)*

ఇప్పుడు ప్రతి ఒక్క వర్గం సంతృప్తి చెందింది. యుద్ధ ఆలోచన ఒక్కసారిగా ఆంతర్యాలలో నుండి తొలగిపోయింది. ఒడంబడికకు సంబంధించిన వ్రాతపూర్వక విషయాలన్నీ సౌహార్ధ పూరితంగా జరిగిపోగలవని అందరూ ఆశించారు. కాని మహనీయ ఉస్మాన్(రజి) హంతకులు మాత్రం ఈ సంధికి సుముఖంగా లేరు. నిజంగా సంధి గనక జరిగితే తాము క్షేమంగా బ్రతికి బట్టకట్టలేమని వారు తలపోశారు. అదీగాక ఇన్ని సంవత్సరాలుగా తాము ఏం ఆశించి ఈ ‘ఆందోళన’ను నడుపుతున్నామో అది ఒక్కసారిగా నిర్వీర్యమైపోతుంది. సబాయీ వర్గానికి చెందిన వారు చాలా మంది మహనీయ అలీ (రజి) శిబిరంలో ఉన్నారు. ఇరువర్గాల వారు నడిరేయి గాఢనిద్రలో ఉండగా సబాయీలు అవతలి వర్గంపై మెరుపు దాడి చేసి రక్తపాతం సృష్టించారు *(తారీఖె తబ్రీ- 6వ సంపుటం, పుట- 3182, 3183).* ఇదే అదనుగా దుండగులు పలుచోట్ల నిప్పు అంటించారు. మహనీయ అలీ (రజి) వాళ్ళను నిలువరించడానికి శాయశక్తులా యత్నించారు. కాని ఎవరూ వినేలా లేరు. కలకలం మొదలయింది. నిద్ర నుండి లేచిన ప్రతి ఒక్కరూ అసలేమయిందో కూడా చూడకుండా తమ తమ ఆయుధాల వైపునకు ఎగబడ్డారు. ఆదమరచి నిద్రపోతున్న సమయంలో అవతలి వర్గం వారు విద్రోహానికి పాల్పడ్డారని ఇరువర్గాల సర్దారులు తలపోశారు.

తెల్లవారే వరకూ ఈ కలకలం కొనసాగింది. గలాటా విని, “ఇంతకీ ఏమయింది?” అని అమ్మ ఆయిషా(ర.అ) అడిగారు. జనులు యుద్ధం మొదలెట్టారని ఆమెకు తెలిసింది. బస్రా న్యాయమూర్తి ఖాజీ కాబ్ బిన్ సౌర్ సయ్యిదా ఆయిషా (ర.అ) దగ్గరకు వచ్చి “మీరు వాహనంపై స్వారీ అయి రంగంలోనికి వస్తే ప్రజలు బహుశా మిమ్మల్ని చూసి సంధికి సన్నద్ధులవుతారేమోనమ్మా” అని ప్రాధేయపడ్డారు *(తారీఖె తబ్రీ- 6వ సంపుటం, పు.3188).* ఆమె తన ఇనుప హౌదజ్‌లో కూర్చుని ఒంటెపై స్వారీ అయి, తన సైనికుల మధ్యకు వచ్చారు. మహనీయ అలీ(రజి), తల్హా, జుబైర్‌లను పిలిపించారు. ఆ ముగ్గురు మహా యోధులు గుర్రాలపై స్వారీ అయి ఒకేచోట భేటీ అయ్యారు.

ఆహ్! ఎంత ప్రభావపూరితమయిన దృశ్యమది!! బద్ర్ ఉహుద్ సంగ్రామాల హీరోలు ఇప్పుడు స్వయంగా పరస్పరం తలపడటానికి సిద్ధంగా ఉన్నారు. మహనీయ అలీ (రజి) వారిద్దరికీ ప్రవక్త మహనీయులు(స) చెప్పిన భవిష్యవాణిని జ్ఞాపకం చేశారు. అంతే, ఒక్కసారిగా ఆ ఇద్దరు మహనీయులకు, తాము మరచిపోయిన స్వప్నం జ్ఞప్తికి వచ్చింది. మహనీయ జుబైర్ (రజి) తన గుర్రాన్ని వెనక్కి త్రిప్పి కదన రంగం నుండి నిష్క్రమిస్తూ మదీనా వైపునకు పయనమయ్యారు. ఇబ్నె జర్మూజ్ అనే సబాయీ దీనిని గమనించి ఆయన వెనుకనే వెళ్ళాడు. ఒక నిర్మానుష్యమైన ప్రదేశంలో మహనీయ జుబైర్ (రజి) నమాజ్ చేస్తూ ప్రణమిల్లగానే ఆ దుర్మార్గుడు వచ్చి ఖడ్గంతో ఒక్క వ్రేటు వేశాడు. అంతే, జుబైర్ (రజి) తల శరీరం నుండి వేరైపోయింది. అతను ఆయన తలను, ఖడ్గాన్ని తీసుకుని మహనీయ అలీ(రజి) సన్నిధికి వచ్చాడు. ఆయన (రజి) కళ్ళల్లో నీళ్ళు ఉబికి వచ్చాయి. ఇలా అన్నారు: “ఎన్నోసార్లు దైవప్రవక్త (సఅసం) ముఖారవిందంపై నుండి విపత్కర మేఘాలను చెదరగొట్టిన కరవాలం ఇది.”

మహనీయ తల్హా (రజి) కూడా వెనుతిరిగి వెళ్ళిపోవాలని సంకల్పించుకుంటూ ఉండగా మర్వాన్ ఉమవీ దృష్టి ఆయనపై పడింది. తల్హా (రజి) బ్రతికి ఉంటే ఉమవీ

కుటుంబీకుల ఇష్టారాజ్యం నడవదని భావించాడు. విషం పూసిన బాణాన్ని గురిచూసి సంధించాడు. అది తల్హా (రజి) మోకాలిలో దిగబడింది. రక్తం ఆగకుండా స్రవించింది. అదే స్థితిలో ఆయన అసువులు బాసారు. సయ్యిదా ఆయిషా (ర.అ) కాబ్ బిన్ సౌర్‌కు తన ఖుర్‌ఆన్ ప్రతిని ఇచ్చి, ప్రజలకు దీనిని చూపించి సంధికి రమ్మని పిలుపు ఇవ్వండి అన్నారు. ఆయన ఖుర్‌ఆన్‌ను తెరచి ఇరువర్గాల మధ్యన నిలబడ్డారు. దుండగులు ఆయన్ని కూడా వదలి పెట్టలేదు. క్షణాల్లోనే ఆయన వీర మరణాన్ని ఆస్వాదించారు.

మధ్యాహ్నమయింది. యుద్ధం అనుకోకుండా- అకస్మాత్తుగా- మొదలయింది. సైన్యాధిపతికి ఇది నచ్చలేదు. ఆయన రణ రంగం నుండి తప్పుకున్నారు. అందువల్ల సయ్యిదా ఆయిషా (ర.అ) సైనిక శిబిరంలో బలహీనత బయల్పడింది. ఇప్పుడు ఎవరెవరితో పోరాడాలి? అన్నదమ్ములే ఒండొకరి కాళ్ళు చేతులపై దాడి జరుపుతూ తమ గుండెలను తలలను ఖడ్గపు వ్రేటుల నుండి కాపాడుకుంటున్నారు. అంటే అనుకోకుండా మొదలయిన ఈ యుద్ధాన్ని విరమించటం మంచిదని వారు సంకేత ప్రాయంగా తెలియజేస్తున్నారు. ఎక్కడ చూసినా మైదానంలో తెగిన కాళ్లు చేతులే కనిపిస్తున్నాయి.

సయ్యిదా ఆయిషా(ర.అ) గనక తమ చేతికి చిక్కితే ఆమె పట్ల అవమానకరంగా వ్యవహరించాలన్నది సబాయీల ఉద్దేశం. అందుకే తల్హా, జుబైర్‌ల తరువాత కూఫా వాసులు ఆమెపై దాడి చేయడానికి ముందుకు దూసుకెళ్లారు (తారీఖె తబ్రీ- 6వ సంపుటం, పు.3193). అటు ఆమె మద్దతుదారులు నలువైపుల నుండి వచ్చి ఆమెకు రక్షణ వలయంగా నిల బడ్డారు. ఈజిప్షియన్ తెగలవారు, అందులోనూ బనూ అదీ, బనూ జిబా తెగకు చెందిన మనుషులు ఆవేశంతో ఊగిపో తున్నారు. ఒకవైపున శత్రు సమూహం చొచ్చుకుని వస్తోంది. మరోవైపున సయ్యిదా ఆయిషా(ర.అ)కు కుడివైపున బకర్ బిన్ వాయల్, ఎడమ వైపున అజ్ద్, ముందు వైపున బనూ నాజియా ముద్దుబిడ్డలు తమ తల్లి గౌరవాన్ని, మర్యాదను కాపాడటానికి ఒక్కొక్కరుగా ప్రాణాలర్పిస్తున్నారు. ఒంటె ఒక చోట నిలబడి ఉంది. సయ్యిదా ఆయిషా(ర.అ) కూర్చుని ఉన్న ఇనుప హౌదజ్ బాణ వర్షానికి జల్లెడగా మారుతోంది. స్వాభిమానులైన ఇస్లాం ముద్దుబిడ్డలు తమ తల్లిని కాపాడు కునే యత్నంలో ముందు వైపు నుండీ, వెనుక వైపు నుండీ, కుడిఎడమల నుండీ శత్రు సమూహాన్ని వెనక్కి నెడుతున్నారు. ఆ సందర్భంగా వారి అధరాలు సగర్వంగా (అరబీలో) ఆలపి స్తున్న కవిత ఇది :

"ఓ మా తల్లీ! మేమెరిగిన మహా తల్లీ!!
మిమ్మల్ని కాపాడుకునే యత్నంలో ఎందరు
వీరులు గాయపడ్డారో, ఎందరు శూరుల
తలలు తెగిపడ్డాయో మీరు చూడటం లేదా!?

✦✦✦


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**



# భారత రైతుకు భరోసా ఏదీ ?

**యండి. ఉస్మాన్ ఖాన్**

**అన్నదాతా సుఖీభవా..** అంటూ రైతును అన్నం పెట్టేవాడిగా భావించి ఎంతగానో గౌరవిస్తారు. రైతేరాజు... రైతు లేనిదే రాజ్యం లేదు.. జై కిసాన్.. అంటూ ఆకాశానికెత్తుతారు. సామాన్య జనం మొదలు నేతలు పాలకుల దాకా రైతును పొగడని వారంటూ ఉండరు. ఛోటా మోటా నాయకుల నుండి, ప్రధానమంత్రి, రాష్ట్రపతి వరకు అనునిత్యం రైతు నామాన్ని జపించేవారే. రైతు సంక్షేమం కోసమే తమ ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ప్రతి సందర్భంలో చెబుతూ ఉంటారు. మరి అటువంటి రైతు సంక్షేమం కోసం ఏం చెయ్యడానికైనా సిద్ధమని పదే పదే చెబుతున్నప్పుడు, రైతు కోసమే, రైతు సంక్షేమం కోసమే చేశామని బొంకుతున్న చట్టాలు చేసేముందు రైతు అభిప్రాయాన్ని, రైతు మనోగతాన్ని పరిగణనలోకి తీసుకునే అవసరం లేదా? రైతుల ఆర్థిక, సామాజిక, జీవన రంగాలతో ముడిపడి ఉన్న అతి ముఖ్యమైన చట్టాలను చేసేటప్పుడు సదరు లబ్దిదారుడి అభిప్రాయం అవసరం లేకుండా ఎలా ఉంటుంది? అసలు ఏ చట్టాలనైనా ఆమోదించే ముందు పార్లమెంటులో చర్చించడం, సభ్యుల ఆమోదం పొందడం తప్పనిసరి. భిన్నాభిప్రాయాలు వ్యక్తమైతే, అఖిల పక్షం ఏర్పాటు చేసి, విస్తృతంగా చర్చించి, ఏకాభిప్రాయం సాధించడానికి ప్రయత్నించడం, సాధ్యం కాకపోతే, కమిటీ వేసి, అది సమర్పించే నివేదిక ఆధారంగా మెజారిటీ సభ్యుల అంగీకారంతో సదరు చట్టాలను ఆమోదించడం సంప్రదాయం. కాని రైతు జీవితంతో ముడిపడి ఉన్న అతి ముఖ్యమైన మూడు చట్టాలను పార్లమెంటులో సరైన రీతిలో చర్చించకుండా, సెలక్ట్ కమిటీకీ పంపకుండా, ప్రతి పక్షాలను లెక్క

చేయకుండా, రైతులతోగాని, రైతు సంఘాలతోకాని మాట వరసకైనా సంప్రదించకుండా మందబలం చూసుకొని తమకు, తమ ప్రీతిపాత్రులైన కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా ఏక పక్షంగా చట్టాలను ఆమోదించుకోవడం ప్రజాస్వామ్యంలో ఎంతవరకు న్యాయం.. ఎంత వరకు ధర్మం.? ఇందులో స్వార్థం, స్వలాభం లేకపోతే, కేవలం రైతుల సంక్షేమం కోసమే అయినప్పుడు, లాక్‌డౌన్ కారణంగా దేశమంతా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి ఉన్న సమయంలో ఎలాంటి చర్చకు అవకాశం ఇవ్వకుండా అంత హడావిడిగా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చింది? అందుకే వివక్షా పూరితమైన, ఈ ఏకపక్ష కార్పోరేట్ అనుకూల, రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని భారత రైతాంగం డిమాండ్ చేస్తోంది. నిజంగానే కేంద్ర సర్కారుకు రైతుల పట్ల, రైతు సంక్షేమం పట్ల ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే, ఈ చట్టాలను ఉపసంహరించుకొని అందరికీ అనుకూలమైన చట్టాలను తీసుకురావచ్చును గదా! రైతుల విషయంలో ప్రతిష్ఠకు పోవడమెందుకు? ఇందులో నామోషీ ఏముంది? రైతు సంక్షేమమే ప్రధానమైనప్పుడు, మంచి మనసుతో వారి గోడు వింటే తప్పేముంది.? అసలు విషయం ఏమిటంటే, రైతులకు మేలు చేస్తున్నామన్న పేరు మీద'తమ' వారికి అంటే, అంబానీ, అదానీల ప్రయోజనాలు కాపాడుకోవడం అసలు ఉద్దేశ్యం. ఈ కుతంత్రాన్ని అర్థం చేసుకున్న రైతులు ఈ దుర్మార్గపు చట్టాలు తమకు అవసరం లేదని ఎదురు తిరిగారు. చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకున్నట్లు, రైతుల పేరు చెప్పి కార్పోరేట్ శక్తుల ప్రయోజనాలు కాపాడడం కోసమే ఈ దుర్మార్గపు చట్టాలను తెచ్చారని భారత రైతాంగం బల్లగుద్ది చెబుతోంది. ఈ దుష్టచట్టాలు ఉపసంహరించుకునే దాకా ఎత్తిన పిడికిలి దించేది లేదని గర్జిస్తూ ఉంది. ఎముకలు కొరికే చలిలో నెల రోజులకు పైగా అనేక రాష్ట్రాల రైతులు దేశ రాజధాని సరిహద్దుల వెంట పడిగాపులు పడుతున్నా మోడీ సర్కార్ సరైన రీతిలో స్పందించలేదు. అసలు ఢిల్లీకే చేరకుండా అడుగడుగునా నిర్బంధాలు విధించడం, రక్తం గడ్డకట్టే ఇంతటి చలిలో వృద్ధులు, మహిళా రైతులపై మంచు నీళ్ళు పిచికారీ చేయడం మానవత్వానికే సిగ్గుచేటు. ప్రధాని, రాష్ట్రపతులు వెచ్చని బంగ్లాల్లో సేద దీరుతుంటే, ఈ ఇద్దరి కంటే వయసులో పెద్ద వాళ్ళైన అసంఖ్యాక మంది వృద్ధ రైతులు, మహిళలు, నాలుగు డిగ్రీల చలిలో, అర్ధాకలితో,

**రైతులు తాము పండించిన కొద్దిపాటి పంట ఉత్పత్తులను దేశంలో ఎక్కడైనా అమ్ముకోగలరా? ఇతర రాష్ట్రాలకు తరలించి అమ్ముకునే అంత స్థోమత వారికి ఉంటుందా? ఎట్టి పరిస్థితిలోనూ తమ పంటను వారు స్థానిక మార్కెట్లలోనే అమ్ముకోవాలి. మార్కెట్‌ను శాసించే కార్పోరేట్ వ్యాపారులకే అమ్ముకోవాలి తప్ప మరో మార్గం లేదు. అందుకే కనీస మద్దతు ధరకు హామీ లేని ఈ దుర్మార్గపు చట్టాలను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.**

నిద్రలేమితో దిక్కులేని వారిగా రహదారుల వెంట రోజులు గడుపుతున్నారు. సర్కార్ నిర్లక్ష్యం కారణంగా నిరసన దీక్షలకు పూనుకున్న రైతుల్లో ఇప్పటి వరకు 35 మంది అసువులుబాసారు. అయినా సర్కార్ ఇవేమీ పట్టించుకోకుండా, నెలరోజులకు పైగా జరుగుతున్న రైతుల ఉద్యమాన్ని అణిచి వేయడానికి ఎంతటి నీచత్వానికైనా దిగజారుతోంది. ఒకదశలో లక్షలాది మంది రైతులను 'వీరసలు రైతులే కాదన్నది.' ఎవరో రెచ్చగొడితే కొంతమంది రోడ్డెక్కారని, ఇందులో ఖలిస్తాన్ హస్తం ఉందని, పాకిస్తాన్ హస్తం ఉందని నిస్సిగ్గుగా రైతులను అవమానించింది. తన ఏజెంట్లను రైతుల ఉద్యమంలోకి పంపి వారిని బదనాం చేయడానికి శక్తిమేర తీవ్రంగా ప్రయత్నించింది. 'ఇదిగో మేము రైతులతో చర్చిస్తున్నాం' అని ప్రజలకు చెప్పుకోడానికి పలు దఫాలుగా విఫల ప్రయత్నాలు చేసింది. రైతులకు ఆమోదయోగ్యంకాని మార్పులను సూచిస్తూ, 'ఇదిగో రైతులే ఒప్పుకోవడం లేదు' అని తప్పు రైతులపై నెట్టడానికి శక్తి వంచనలేని ప్రయత్నాలు చేసింది. నిర్దిష్టమైన ఎజెండాతో చర్చలకు పిలవాలని రైతులు, రైతుసంఘ నేతలు పదే పదే చెబుతున్నప్పటికీ, తాను విధించిన షరతుల పరిధిలోనే చర్చించాలని తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళని మోడీ సర్కార్ మొండి పట్టుపడుతోంది. ఎవరినీ సంప్రదించకుండా, ఎవరి మాటా వినకుండా, తమ అభీష్టానికీ, తమ ప్రయోజనాలకు, చివరికి తమ జీవితానికే భద్రత లేని విధంగా నియంతృత్వంగా మోడీ సర్కార్ తమపై రుద్దుతున్న దుష్ట చట్టాల

వల్ల భారతదేశ వ్యవసాయ రంగం కార్పోరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్ళిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాంటిదేమీ లేదని ఈ చట్టాల వల్ల రైతులకు స్వేచ్ఛ లభిస్తుందని, భారతదేశ వ్యాప్తంగా ఎక్కడైనా సరే తమ ఉత్పత్తులు అమ్ముకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. కాని ఈ మాటల వెనుక ఉన్న దుర్బుద్ధిని రైతులు పసిగట్టారు. చిన్న, సన్నకారు రైతులు తాము పండించిన కొద్దిపాటి పంట ఉత్పత్తులను దేశంలో ఎక్కడైనా అమ్ముకోగలరా? ఇతర రాష్ట్రాలకు తరలించి అమ్ముకునే అంత స్థోమత వారికి ఉంటుందా? ఎట్టి పరిస్థితిలోనూ తమ పంటను వారు స్థానిక మార్కెట్లలోనే అమ్ముకోవాలి. మార్కెట్‌ను శాసించే కార్పోరేట్ వ్యాపారులకే అమ్ముకోవాలి తప్ప మరో మార్గం లేదు. అందుకే కనీస మద్దతు ధరకు హామీ లేని ఈ దుర్మార్గపు చట్టాలను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ఆ ప్రాతిపదికపైన్నే చర్చలు జరగాలని రైతులు స్పష్టంగా చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం 'రద్దు' మినహా, ఆ మేరకు ఉత్తుత్తి హామీ మాత్రం ఇస్తామంటోంది కాని, ప్రస్తుత చట్టాలను ఉపసంహరించుకొని, కొత్త చట్టంలో ఆ విషయం చేరుస్తామని మాత్రం చెప్పడం లేదు. ప్రతి నెలా చివరి ఆదివారం మోడీ 'మన్ కీ బాత్' పేరుతో ప్రజలకు తన భావాలు చెబుతుంటారు. 2020 చివరి మన్ కీ బాత్‌ను రైతులు బహిష్కరించారు. 'మీ మన్ కీ బాత్ వినీ వినీ చాలా అలసిపొయ్యాం. ఇంకా వినే ఓపిక మాకు లేదు. మీరు మా మాట విననప్పుడు మేము మీ మాట ఎందుకు వినాలి?' అంటూ అన్నం తినే ప్లేట్లు వాయిస్తూ రైతులంతా నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డిసెంబరు 30న జరిగిన చర్చలు కూడా అసంపూర్తిగానే ముగిశాయి. ఇప్పటికీ ఏడు సార్లు చర్చలు జరిగినా, మళ్ళీ జనవరి నాల్గవ తేదీకి వాయిదా పడ్డాయి. అప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం.

ప్రభుత్వం మాత్రం పంతానికి పోతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. రైతు సంక్షేమమే ప్రధానమైనప్పుడు, ఇందులో 'రైతు' తప్ప, తమ, 'తమ' వారి స్వార్థం, స్వలాభం ఏమీ లేనప్పుడు ప్రస్తుత చట్టాలను రద్దుచేసి, మళ్ళీ కొత్త చట్టాలు రూంపొందించవచ్చు. కాని ప్రభుత్వ ఉద్దేశ్యం అది కానే కాదు. అందుకే రైతులతో అమీ తుమీకే మోడీ సర్కార్ సిద్ధపడ్డట్లుగా కనబడుతోంది. ఏది ఎలా ఉన్నా కేంద్రసర్కారుతో భారత రైతాంగానికి సుదీర్ఘ పోరాటం మాత్రం తప్పక పోవచ్చు. ✤


## మస్జిద్ ఇషాఅతె ఇస్లామ్ ఢిల్లీ కోసం

## విరాళాల సేకరణ

ఢిల్లీలోని జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్ర కార్యాలయం ప్రాంగణంలోని మస్జిద్ ఇషాఅతె ఇస్లామ్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. గత కొన్నేళ్ళుగా నమాజీల రాక పెరగడంతో మస్జిద్ ఇరుకుగా మారింది. ముఖ్యంగా జుమా నమాజ్, రమజాన్ మాసం, ఈద్ నమాజ్‌లలో ఈ రద్దీ మరింత పెరుగుతోంది. దీంతో మస్జిద్ విస్తరణ పనులు చేపట్టాం. అల్‌హమ్దులిల్లాహ్ నాలుగేళ్ళ క్రితం ప్రారంభించిన విస్తరణ పనులు ఇప్పుడు తుది దశకు చేరుకున్నాయి. ఇన్షాఅల్లాహ్ పది వేల మంది నమాజ్ చదివే వీలుంటుంది.

రాబోయే రమజాన్ లోపే నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాము.

మా విన్నపం ఏమిటంటే, మస్జిద్ విస్తరణ మహత్కార్యంలో మీరూ భాగస్వాములై గొప్ప ప్రతిఫలం పొందగలరు.

అల్లాహ్ మీకు ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక!

**అకౌంట్ వివరాలు**

చెక్‌పై కేవలం **"Ishaat-e-Islam Trust"** అని మాత్రమే వ్రాయండి

**ISHAAT-E-ISLAM TRUST**

**A/c No. 1447308306**
**IFSC Code : CBIN0282953**

**Central Bank of India, Sukhdev Vihar, New Delhi**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**తఫ్హీముల్ ఖుర్ఆన్ (ఖుర్ఆన్ అవగాహనం): మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది, తెలుగురూపం: ఎస్.ఎమ్. మలిక్**

**88 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 38. సాద్

24–26... వాస్తవానికి కలిసి మెలిసి సహజీవనం చేసే జనులు తరచుగా ఒకరిపై నొకరు అక్రమాలు చేస్తూనే ఉంటారు. అయితే విశ్వాసం గలవారు, సదాచరణ జరిపేవారు మాత్రమే దీన్ని తప్పించుకుని ఉన్నారు, ఇటువంటి వారు బహు అరుదు." (ఈ మాట పలుకుతూ ఉండగా) దావూద్ గ్రహించాడు, ఇది వాస్తవానికి మేము అతన్ని పరీక్షించిన వైనమని, కనుక అతను తన ప్రభువును క్షమాభిక్ష అర్థించాడు, సజ్దాలో పడిపోయాడు, దైవం వైపునకు మరిలాడు.[26] అప్పుడు మేము అతని ఆ తప్పిదాన్ని మన్నించివేశాము, నిశ్చయంగా మా వద్ద అతనికి అతి సన్నిహిత స్థానముంది, ఇంకా ఉత్తమ అంతిమ పరిణామముంది.[27] (మేము అతనికి చెప్పాము) దావూద్, మేము నిన్ను భువిలో ఖలీఫా చేశాము, కనుక నీవు జనుల మధ్య ధర్మంగా పరిపాలన చెయ్యి. మనోకాంక్షను అనుసరించకు, అది నిన్ను దైవమార్గం నుంచి దారి తప్పిస్తుంది. ఎవరయితే దైవమార్గం నుండి తప్పిపోతారో నిశ్చయంగా వారి కొరకు కఠినమయిన శిక్ష పొంచి ఉంది, కారణం వారు లెక్కచూపే దినాన్ని అసలే మరచిపోయారు."28

---

**(26వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

ఈ ఆయత్ పఠించిన సందర్భంలో ఆయన మింబర్ (వేదిక) దిగి సజ్దా చేశారు, ఆయనతో పాటు హాజరయిన శ్రోతలందరూ సజ్దా చేశారు. మరోసారి ఇలాగే ఆయన ఇదే సూరా పఠించారు. అప్పుడు ఈ ఆయత్ చదవగానే జనం సజ్దా చెయ్యడానికి ఉద్యుక్తులయ్యారు. ప్రవక్తశ్రీ (స), "ఇది ఒక ప్రవక్త చేసిన తౌబా. కాని మీరంతా సజ్దా చేయడానికి సన్నద్ధులవడం నేను గమనిస్తున్నాను" అంటూ ఆయన మింబర్ దిగి సజ్దా చేశారు, హాజరయిన వారంతా కూడా సజ్దా చేశారు (అబూదావూద్). ఈ ఉల్లేఖనాల ద్వారా సజ్దా చేయటం విధి అన్న విషయ మయితే ఖచ్చితంగా నిర్ధారణ కాదు. అయితే ప్రవక్త మహనీ యులు తరచుగా ఈ ఆయత్ పఠించిన సందర్భంలో సజ్దా చేశారన్నది మటుకు నిశ్చయంగా నిర్ధారణ అవుతుంది. సజ్దా చేయకపోవడం కన్నా ఇక్కడ సజ్దా చేయడం మాత్రం ఉత్తమం అని రుజువవుతుంది. అంతేకాదు, ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖించిన మూడవ కథనం, బుఖారీ ద్వారా మేము ఉటం కించిన దాని ప్రకారం, విధి కాకపోవడం కన్నా విధి అవడం పట్ల అధికంగా మొగ్గు చూపుతుంది.

మరో విషయం ఈ ఆయత్ ద్వారా తేలేదేమిటంటే పరమ ప్రభువు ఇక్కడ (రుకూలో పడిపోయాడు) అన్న పదాలు ప్రయో గించాడు. కాని సమస్త వ్యాఖ్యాతలు ఇక్కడ ముక్తకంఠంతో (సజ్దాలో పడిపోయాడు) అనే భావాన్నే ప్రకటించారు. ఈ కారణంగానే ఇమామ్ అబూ హనీఫా, ఆయన సహచరులు అభిప్రాయపడిన దాని ప్రకారం, నమాజ్ స్థితిలోనయినా నమాజ్ కానివేళ అయినా సజ్దా ఆయత్ విన్నప్పుడు లేదా చదివినప్పుడు మనిషి సజ్దాకు బదులు రుకూ చేయవచ్చు. ఎందుకంటే అల్లాహ్ రుకూ అన్న పదం ప్రయోగించి సజ్దా భావం ఉద్దేశించినందువల్ల రుకూ సజ్దాకు సమాన స్థాయి గలది కావచ్చు అని బోధపడుతుంది. షాఫియీ ఫుకహా (ధర్మ శాస్త్రవేత్తల)లో ఇమామ్ ఖత్తాబీ కూడా ఇదే అభిప్రాయం వెలిబుచ్చారు. ఈ అభిప్రాయం దాని స్థానాన సరయినదే, సహేతుకమయినదే అయినప్పటికీ ప్రవక్త మహనీయులు(స) ఆయన సహచరుల ఆచరణలో మనకు అటువంటి దృష్టాంత మేదీ కానరాదు, సజ్దా ఆయత్ సందర్భంలో సజ్దా చేయడా నికి బదులు రుకూ చేయడంతో సరిపుచ్చినట్లు గోచరించదు. అందువల్ల ఈ అభిప్రాయాన్ని అమలుపరచడం అన్నది, సజ్దా చేయడంలో ఏదయినా అవాంతరం ఏర్పడినటువంటి సందర్భంలో మటుకే జరగాలి. దీన్ని సర్వసాధారణంగా ప్రయో గించడం సరయినది కాదు. స్వయాన ఇమామ్ అబూ హనీఫా, ఆయన సహచరుల అభిమతం కూడా, దీన్ని సర్వసాధా రణంగా అమలు జరపాలన్నది కాదు, వారు కేవలం ఇది అనుమతించబడిందని మాత్రమే నమ్మేవారు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (3వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)**

**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

## వాణిజ్య ప్రకరణం

**(క్రయ విక్రయాలు)**

**344)** "మీలో ఎవరయినా ద్రవ్య మార్పిడి వ్యాపారం (అంటే దీనార్లు, దిర్హంలు, నాణేల మారకం పని) చేస్తారా? అని మాలిక్ బిన్ ఔస్ అడిగితే, "నేను చేస్తాను. అయితే మా కోశాధికారి 'గాబా' [1] నుండి వచ్చిన తరువాతే ఈ పని అవుతుంది" అని తల్హా చెప్పారు. జుహ్రీనుండి ఈ హదీసును మేము ఇలాగే విన్నాము. ఇందులో ఎలాంటి హెచ్చు తగ్గులు జరగలేదని సుఫ్యాన్ వివరించారు. ఆ తరువాత ఆయన ఇలా అన్నారు– నాకు మాలిక్ బిన్ ఔస్ సమాచారం అందించారు, ఆయన ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) నుండి విన్నారట. దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రవచించారని ఆయన చెబుతూ ఉండేవారు: "బంగారాన్ని బంగారానికి బదులుగా అమ్మడం వడ్డీ క్రిందికి వస్తుంది. అయితే నగదు బదిలీ జరపవచ్చు. గోధుమలను గోధుమలకు బదులుగా అమ్మటం వడ్డీ క్రిందకి వస్తుంది. అయితే నగదు చేతులు మారవచ్చు. ఖర్జూర పండ్లు ఖర్జూరపండ్లకు బదులుగా అమ్మటం వడ్డీ క్రిందికి వస్తుంది. అయితే నగదు వ్యవహారం జరపవచ్చు. యవలు యవలుకు బదులుగా అమ్మటం వడ్డీయే. అయితే నగదు వ్యాపారం సరైనదే. [2]

### అధ్యాయం : 54

### ఆహార ధాన్యాన్ని స్వాధీనపరచుకోకముందే అమ్మటం, తమ వద్ద లేని వస్తువును అమ్మటం. [1]

**345)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఈ విధంగా చెప్పగా తాను విన్నానని తావుస్ తెలిపారు– ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : "దైవప్రవక్త(సఅసం) వారించినది, స్వాధీనంలోకి రాని ఆహార ధాన్యాన్ని అమ్మటాన్నే." ఇబ్నె అబ్బాస్ (రజి) ఇంకా ఇలా అన్నారు : "నేనైతే, వస్తువులన్నింటికీ ఇదే ఆదేశం వర్తిస్తుందని భావిస్తున్నాను." [1]

344-1. మదీనాకు కొంత దూరాన ఉన్న ఒక ఊరి పేరు 'గాబా'. అక్కడి వృక్షంతోనే దైవప్రవక్త(సఅసం) కొరకు మింబర్ (ఉపన్యాస వేదిక) తయారు చేయబడింది.

344-2. ఈ హదీసు ద్వారా విదితమయిన విషయం ఏమి టంటే గోధుమలు - యవలు (జవ్) వేర్వేరు ధాన్యాలు. ఈ విషయంలో షాఫియి (రహ్మ), అబూ హనీఫా (రహ్మ), అహ్మద్ (రహ్మ) అహ్లె హదీసు వారందరి అభిప్రాయం ఇదే. మాలిక్, లైస్ మాత్రం వీటిని ఒకే దినుసుగా పరిగణించారు. వీరి దృష్టిలో యవలను కూడా గోధుమలకు బదులుగా- అరువుగా- అమ్మ కూడదు. అలాగే బియ్యం, జొన్నలు కూడా వేర్వేరు ఆహార ధాన్యాలే. దీనిపై మున్ముందు చర్చ జరగనుంది.

54-1.అధ్యాయంలోని హదీసులలో, అమ్మకందారు వద్ద లేని వస్తువు అమ్మకాన్ని వారించినట్లుగా లేదు. బహుశా ఇమామ్ బుఖారీ గారు, స్వాధీనంలోకి రాకముందే ఆహార ధాన్యాలను అమ్మటం సముచితం కాదన్న సూత్రాన్ని ఆధారంగా చేసుకుని ఈ నిర్ణయానికి వచ్చి ఉంటారు. అయితే ఈ అధ్యాయం క్రింద ఒక స్పష్టమైన హదీసు ఉంది. దానిని అస్హాబె సునన్ హకీమ్ బిన్ హిజామ్ నుండి సంగ్రహించారు. దాని ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "నీ దగ్గర లేని వస్తువును అమ్మకు." బహుశా ఈ హదీసు ఇమామ్ బుఖారీ గారి షరతులకు అనుగుణంగా లేదేమో. ఆ కారణంగానే ఆయన దీనిని ఇక్కడ పొందుపరచలేదేమో!


345-1. అంటే, ఏ వస్తువు అయినాసరే పూర్తిగా స్వాధీనంలోకి రాకముందే దానిని అమ్మకూడదు. ఇది ఇబ్నె అబ్బాస్(రజి) గారి 'ఇజ్తెహాద్' (షరీఅత్ సూత్రాన్ని అన్వయింపజేయడానికి సలిపిన కృషి). 'ఇది హకీమ్ బిన్ హిజామ్ గారి హదీసుకు అనుగుణంగా ఉంది.

**నూర్ బాషా రహంతుల్లా**
విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలక్టర్, 6301493266



# కంటి చూపును కాపాడుకోవాలి!

**సర్వేంద్రియాణాం నయనం ప్రధానం** అన్నారు. కన్ను తెరిస్తే జననం! కన్ను మూస్తే మరణం! రెప్పపాటే గదా జీవితం? అన్నారు. నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి అన్నాడు ఆత్రేయ. ఎలుగుబంటి ఒక కంటితోనే నిద్రపోతుందట. రాజు కూడా తన కంటి చూపును బాగు చేసుకుంటూ ప్రజలను కంటిపాపల్లాగా చూసుకుంటూ అందరికీ బాగుండాలన్నారు. సృష్టిని చూడాలంటే కంటిచూపే గదా ముఖ్యం? అయితే



ఈనాడు ప్రజల కంటిచూపు ఆపదలో పడింది. చీకట్లో మగ్గుతున్న వారెందరో కంటిచూపు కోసం ఎదురుచూస్తు న్నారు. వాతావరణ కాలుష్యం, ఆహారపు అలవాట్ల మూలంగా ప్రపంచ జనాభాలో సగం మందికి మయోపియా అనే హ్రస్వదృష్టి సోకుతుందట. వయసు పెరిగేకొద్దీ చూపు మసకబారుతుంది. దృష్టి సన్నగిల్లి, ఒకే వస్తువు రెండుగా కనిపించడం, మసగ్గా కనిపించడం, కళ్ల ముందు మెరుపులు, ఏవేవో మెరుపు తీగలు తేలుతున్నట్లు కనిపించడం, చూసే దృశ్యం మధ్యలో నల్లమచ్చ కనిపించడం, కొంత భాగం కనపడకుండా పోవడం లాంటి సమస్యలు వస్తున్నాయి. శుక్లాలు, నీటికాసులు(గ్లకోమా), కార్నియా అంధత్వం, మెల్ల కన్ను, రెటినోపతి లాంటి దృష్టి లోపాలను మంచి ఆహారము, చికిత్సలతో తొలగిస్తున్నారు. కళ్లలోని కార్నియా దెబ్బతిన కుండా క్యాటరాక్టు రాకుండా కళ్లు ఆరోగ్యంగా, అందంగా ఉండటం కోసం ఒమేగా-3 నిచ్చే గుడ్లు, చేపలు తినమంటు న్నారు. అలాగే విటమిన్-ఏ, సి బీటా కెరోటిన్‌లు కావాలంటే మొక్కజొన్న, పాలకూర, కేరట్లు, సిట్రస్ ఫ్రూట్స్ బాగా తిన మంటున్నారు. పొగతాగడం మానేయ్య మంటు న్నారు. మరణించిన తర్వాత నేత్రాలు వృథాగా పోకుండా ఉండేందుకు అందరూ నేత్రదానం చేయమంటున్నారు. ఒకరు దానం చేయడం ద్వారా ఇద్దరికి కంటిచూపు వస్తుందట. క్యాటరాక్ట్ (తెల్ల ముత్యం) వల్ల లెన్స్ తన పారదర్శకతను కోల్పోతుంది. శుక్లాలు, క్యాటరాక్టులు 65 ఏళ్ల వయసు దాటాక ఎలాగైనా వస్తాయి. మధుమేహం మందు లను ఎక్కువగా సేవించడం వల్ల కూడా శుక్లాలు వస్తున్నా యని అంటున్నారు. చక్కెర నోటికి తీపి అయినా కళ్లకు మాత్రం చేదే. కన్నుకు డయాబెటిస్ వల్ల రెటినోపతి అనే సమస్య రావచ్చు. రక్తనాళాల చివర్ల (క్యాపిల్లరీస్)లో అడ్డం కులు ఏర్పడితే కంటికి రక్తం అందక చూపు చచ్చుబడు తుంది. అందుకే డయాబెటిస్ ఉన్నవారు తరచూ కంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. డయాబెటిస్‌ను, రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి. కొందరికి పుట్టుకతోనే కంజెనిటల్ క్యాటరాక్ట్‌లు వస్తున్నాయి. కంటి లోపలే మబ్బు కమ్మిన కటకాన్ని తీసేసి ఒక కృత్రిమమైన కటకాన్ని అమర్చు తారు. శస్త్ర చికిత్స జరిగిన తరువాత మీ చూపు మెరుగవు తుంది. అద్దాల అవసరం కూడా వుండకపోవచ్చు. క్యాటరాక్టు ఒకే కంటికి రావచ్చు లేక రెండు కళ్లకి రావచ్చు, అంతేకాని అది ఒక కంటిలో నుండి మరో కంటికి వ్యాపించదు. మన దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు ఒకరు చొప్పున పిల్లలు అంధత్వానికి గురవుతున్నారు. శుక్లాలతో పుట్టిన పిల్లలకు

శస్త్ర చికిత్స వెంటనే చేయించాలి. కార్నియా లోపంతో గుడ్డి వాళ్ళయిన పిల్లలకు కార్నియా మార్పిడి చికిత్సతో కొంత మేరకైనా వారికి తిరిగి చూపు అందించవచ్చు. పిల్లల్లో కార్నియా సమస్యతో వచ్చే అంధత్వానికి ప్రతి ఆరుమాసాలకు ఒకసారి 200000 ఐయు విటమిన్-ఏ ఇప్పించాలి. విటమిన్-ఏ లోపం వల్ల ముందుగా రేచీకటి సమస్య వస్తుంది. పిల్లలు రాత్రిపూట తడబడుతున్నా, పదే పదే వస్తువులను గమనించక పడదోస్తున్నా అది రేచీకటి సమస్యగా గుర్తించాలి. ఆరు మాసాల వయసు నుంచే పిల్లలు తల్లిని గుర్తు పడుతుంటారు. పరిశీలనగా అన్ని వైపులా చూస్తారు. తరుచూ కనురెప్పలు కొట్టుకొంటూ, కనుగుడ్లు అదేపనిగా తిప్పుతూ ఉన్నా, రంగు వస్తువులను చూపినా వాటిని చూడకుండా మరోవైపు చూస్తున్నా, కళ్లు మరీ పెద్దవిగా ఉన్నా కంటి సమస్యలు ఉన్నట్లు అనుమానించాలి. మెల్ల ఉన్నప్పుడు రెండు కళ్ల నుంచి మెదడుకు చేరే ప్రతిబింబాలలో మెదడు స్పష్టంగా ఉన్న ప్రతిబింబాన్ని పరిగణనలోకి తీసుకుని మసకగా ఉండే రెండవ ప్రతిబింబాన్ని నిర్లక్ష్యం చేస్తుంది. కాలం గడిచేకొద్దీ మెల్లకంటి చూపు మరింత తగ్గి చివరికి అంధత్వానికి దారి తీస్తుంది. శస్త్ర చికిత్స ద్వారా కంటి కండరాలను సరిచేసి మెల్లను నివారిస్తారు. కంటిలో ఉండే ద్రవాలతో నరం మీద ఒత్తిడి పెరిగి గ్లకోమా వచ్చి కంటిచూపు కోల్పోతే యాంటీ గ్లకోమా చుక్కల మందు జీవితకాలం వాడాలి. ఆహారంలో విటమిన్- ఏ పాళ్లు పెంచడం వల్ల రేచీకటి (నైట్ బ్లైండ్‌నెస్)తగ్గుతుంది. పక్షవాతం (స్ట్రోక్) వల్ల మెదడులోని భాగాలు రక్తసరఫరా తగ్గి చచ్చుబడి పోతాయి. మెదడులో వచ్చే గడ్డలు (బ్రెయిన్ ట్యూమర్స్) చూపును మెదడుకు చేరవేసే ఆప్టిక్ నర్వ్ అనే నరాన్ని నొక్కి వేయడం వల్ల కంటికి ఎదురుగా దృశ్యం సగమే కనిపించ వచ్చు. లేజర్ చికిత్స, శస్త్రచికిత్సలతో కాంతినరాలపై ఒత్తిడిని అదుపులోకి తెస్తారు. విడిపోయిన రెండు రెటీనా పొరలను కలుపుతారు. కొందరిలో కనుగుడ్లు ముందుకు పొడుచుకు వచ్చినట్లుగా కనిపిస్తుంటాయి. థైరాయిడ్ హార్మోన్ల సమతౌల్యత నెలకొనేలా హార్మోన్ చికిత్స తీసుకోవాలి. కంటి నల్ల గుడ్డు ప్రాంతం ఉబ్బెత్తుగా ఉంటే కాంటాక్ట్ లెన్స్‌లతో చికిత్స చేయవచ్చు. డయాబెటిస్ నివారణకు ఫ్రెడరిక్ బాంటింగ్ ఇన్సులిన్‌ను, అలెగ్జాండర్ ఫ్లెమింగ్ పెన్సిలిన్‌ని, జోనస్ సాక్ పోలియో టీకాను, ఎడ్వర్డ్ జెన్నర్ మశూచి వ్యాక్సిన్‌ను కనుగొన్నారు. వ్యాక్సిన్లు, యాంటిబయాటిక్‌ల వల్ల మానవాళి అనేక మహమ్మారులను ఎదుర్కొంది. త్వరలో కరోనాకు వ్యాక్సిన్ రావచ్చు. వైద్యులు శాస్త్రవేత్తల కొత్త అన్వేషణలతో ప్రజల కంటి చూపును పదిలంగా కాపాడుకోవాలి! ✤

# అలా చూడకండి!

ఒకానొక మహిళ చేతిలో పళ్లెంలో ఏవో పదార్థాలు తీసుకెళుతోంది. పళ్లెంపై ఏదో గుడ్డ కప్పి ఉండటంతో పళ్లెంలో ఏముందో తెలుసుకోవాలన్న కుతూహలం అటుగా వెళుతున్న ఓ పండితుడికి కలిగింది. 'అమ్మా ఈ పళ్లెంలో ఏముంది' అని అడిగారాయన. 'ఇందులో ఉన్నదేమిటో చెప్పదలుచుకున్నప్పుడు పళ్లాన్ని కప్పి తీసుకెళ్లాల్సిన అవసరమేముంది' అని బదులివ్వడంతో పండితుడు సిగ్గుతో తలదించుకున్నాడు.

ఆమె చెప్పిన మాటల్లో జీవితానికి పనికొచ్చే చిట్కాలున్నాయి. 'ఏదైనా వస్తువు, మాట రహస్యంగా ఉంచదలిచినప్పుడు దాన్ని బహిర్గతం చేసే ప్రయత్నం చేయకూడదన్న నిగూడార్థం ఇందులో దాగి ఉంది. ఒకరి వెంట పడి వారి లోపాలను, బలహీనతలను బహిర్గతం చేయరాదన్న సందేశం ఇందులో ఉంది. ప్రతి ఒక్కరిలో మంచి-చెడు రెండు అలవాట్లూ ఉంటాయి. మనం మన చెడ్డ అలవాట్లు, లోపాలు ఒకరిముందు బహిర్గతం కాకుండా జాగ్రత్త పడతాము. పైనున్న ఆ దేవుడు మనలోని ఆ దుర్గుణాలపై పరదా కప్పి మన గౌరవమర్యాదలను కాపాడతాడు. ఒకవేళ అంతరంగంలో మనం చేసే తప్పులు, పొరపాట్లు, చెడ్డ పనులు అన్నీ బహిర్గతమైతే ఒకరినొకరం అసహ్యించుకునే వారము.

అందుకే ఒకరి లోపాలు వెతుక్కుంటూ, ఒకరిని అభాసుపాలు చేసే చిల్లరపనులు మానుకోవాలి అంటారు పెద్దలు. 'తేనెటీగలా మారండి. ఈగలా మారకండి' అన్నారు హజ్రత్ అలీ (రజి). తేనెటీగ పుష్పాలపై మకరందాన్ని సేకరిస్తుంది. ఈగ దుర్గంధంపై, గాయాలపై వాలి దుర్గంధాన్ని వెదజల్లుతుంది. అందుకే ప్రతి ఒక్కరిలో మంచినే చూడండి. సంతోషంగా ఉండండి.

అబ్దుస్సమద్, నంద్యాల



# మెటర్నిటీ దవాఖాన

పతంగే బాయి  ఆనందంతో గల్లీ మొత్తం జిలేబీ పంచింది. దవాఖానకెళ్ళి డాక్టరమ్మ మొదలు నర్సులందరికీ రాజస్థాన్ ఫేణీ పంచటానికి మరీ వచ్చింది. చిన్న కొడుక్కి పెళ్ళై ఐదేళ్ల తరువాత కోడలు కడుపు పండింది. తన ఇతర కోడళ్ళకు, కూతుళ్లకు పెళ్లయిన ఏడాదికే పిల్లలు పుట్టారు. చిన్న కోడలు ధనవంతుల పిల్ల. అబ్బాయికి మున్సిపల్ ఆఫీసులో ఉద్యోగం.

ఆనంద్ ముఖర్జీ కారు దవాఖాన ముందు ఆగింది. కారు దిగుతూనే ఆసాంతం చూపును సారించారు ముఖర్జీ దంపతులు. 'ముస్లిం మెటర్నిటి హాస్పిటల్'. ఆసుపత్రి నిర్వహణ బాధ్యతంతా ఆడవాళ్లదేలా కనిపిస్తోంది. పారిశుధ్య సిబ్బంది, ఆయాలు, నర్సులు, ఫార్మసిస్టులు, డాక్టర్లు, రిసెప్షన్ ఇలా ఎక్కడ చూసినా అమ్మాయిలు, నడివయసు మహిళలే ఉన్నారు. మగ వాసన అన్నదే కానరావడం లేదు. దవాఖానాలో ఈసడింపులు, కసురుకోవడాలు లేవు. రోగులను ఎంతో ప్రేమగా గౌరవంగా చూసుకుంటారు. నలభై ఏండ్ల క్రితం ఓ గర్భిణి మగ డాక్టరుతో కాన్పు చేయించుకోనని ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన కలచివేయగా అప్పట్లో ఓ పెద్దాయన మనసులో మొగ్గతొడిగిన ఆలోచనే నేడు పుష్పించి వటవృక్షంలా అవతరించింది. వచ్చిన ప్రతీ గర్భిణిని అక్కున చేర్చుకుని చంటి పిల్లలతో సంతోషంగా ఇంటికి పంపుతుంది ఆసుపత్రి. ముఖర్జీ గారికి ఆ దవాఖానకు ఉన్న సంబంధం తీరనిది. ముఖర్జీ పోలీస్ అధికారిగా రిటైరయ్యారు. ఇక్కడి వాతావరణం ఆయన్ను ఎక్కడకీ వెళ్లనివ్వలేదు. ఇక్కడే సెటిలయ్యారు.

ముఖర్జీ గారి  హోదాకు తగ్గట్లు అప్పట్లో వెలసిన కార్పొరేట్ ఆసుపత్రులు ఆయనకు ఉచితంగా సేవలందించేవి. తన డ్రైవర్ యాఖూబ్ ద్వారా ఇక్కడి సిబ్బంది చిత్తశుద్ధి, వృత్తి పట్ల వారికున్న అకుంఠిత దీక్ష తెలుసుకుని తన ముగ్గురు అమ్మాయిలకు ఈ ఆసుపత్రిలోనే కాన్పులు చేయించారు. పతంగె బాయి భర్త రుద్రమాంగే ముఖర్జీ ఇంటి పరుపులు, పరదాలు అన్ని కుట్టిస్తు అలాగే మంచి పరిచయస్తులయ్యారు. తన సలహా మేరకు వాళ్లు ఏ రోగమొచ్చినా ఈ దవాఖానాలో వాలడం అలవాటు అయింది. పతంగె బాయి కోడలుకు పెళ్లయి ఐదేళ్లయినా కడుపు పండలేదని చెట్టూ పుట్టగా తిప్పుతుంటే ముఖర్జీ శ్రీమతికి తెలిసి చీవాట్లు పెట్టి మెటర్నిటి ఆసుపత్రిలోనే డాక్టర్ తబస్సుమ్ సయ్యిదా వద్ద చూపెట్టమని సలహా ఇచ్చింది. నాలుగు నెలలు తిరక్కముందే కోడలు పిల్ల శుభవార్త చెప్పింది. కాన్పులో తన కోడలు మగ బిడ్డ ప్రసవించినట్లు పతంగె బాయి మాటిమాటికి ఫోన్ చేస్తుంటే ఆమె ఆనందంలో పాలుపంచుకుందాం అని సతీసమేతంగా వచ్చారు ముఖర్జీ గారు.

గుయ్.. గుయ్..  హారన్ కొట్టుకుంటూ అంబులెన్స్ వచ్చి ఆగింది మెటర్నిటి ఆసుపత్రి లోపలి గేటు వరకు. వాహనంలో నుంచి దూకినంత పనిచేసింది ఎలిజబెతమ్మ. నా బిడ్డను కాపాడండమ్మా అంటూ అంబులెన్స్ దగ్గరికి వచ్చిన ఎమర్జెన్సీ వార్డు సిబ్బంది కాళ్లు పట్టుకోబోతుంది. కాన్పు చేస్తామని చేతులెత్తేసిన మరో ఆసుపత్రి వాళ్ళను తిడుతుంది. నిన్నటి నుండి నొప్పులు వస్తుంటే,

కాన్పు చేస్తామని పైసలు కట్టించుకొని ఇప్పుడు శివారులోని ఆసుపత్రిలో డాక్టర్లు కష్టం అన్నారంటా. ప్రభూ! నా పిల్లను కాపాడు అంటూ వేడుకుంటుంది. ఫార్మాలిటీస్ పూర్తి చేసి గర్భిణి యువతిని లోపలికి తీసుకెళ్లారు సిబ్బంది. డాక్టర్ రుఫేదా అప్పుడే జొహార్ నమాజ్ చేసుకుని భోజనం చేద్దాం అని టిఫిన్ ఓపన్ చేయబోతుంటె నర్స్ పద్మావతి పరుగెత్తుకుంటూ వచ్చింది. టిఫిన్ అలాగే వదిలేసి నా ట్రీట్మెంట్ ఫలప్రదం చేయి అల్లాహ్... అంటూ మనసులో దువా చేసుకుంటూ నర్స్ వెంటవెళ్ళారు డాక్టర్ రుఫేదా. అక్కడ ట్రీట్మెంట్ ఏం చేసారో డిశ్చార్జ్ రిపోర్ట్ చూస్తూ పేషంటుకు ధైర్యం చెబుతూ బుగ్గలు నిమిరారు. బయట ఉన్న వాళ్ళకు ధైర్యం చెప్పిరమ్మని, కాన్పుకు ఏర్పాటు చేసి అరగంటలో సాధారణ కాన్పు చేశారు. పాప బరువు వగైరా చూసి శుభ్రపరిచి ఆపరేషన్ థియేటర్ ముందు ఆతురతగా ఎదురు చూస్తున్న అమ్మమ్మ, నాయనమ్మ తదితరులకు పాపను చూపెట్టారు. మహిళల కోసం, మహిళల చేత నిర్వహిస్తున్న ఈ ఆసుపత్రి హైదరాబాద్ చాదర్‌ఘాట్ చౌరస్తాలో ఉంది. ఉన్నత వైద్య ప్రమాణాలతో అత్యంత తక్కువ ఖర్చుతో నిర్వహిస్తున్న ఈ దవాఖాన సేవలను అన్ని వర్గాలవారూ లబ్ధిపొందుతున్నారు. ❖

## మారుతున్న పరిస్థితులు - మన బాధ్యతలు

పూర్వం విద్యుత్తు వ్యవస్థ లేని రోజుల్లో చిన్న చిన్న దీపాల వెలుతురులోనే గడిపేవాళ్లు. చీకటి పడిన కాసేపటికే పడక ఎక్కేవారు. పెందలకడనే నిద్రపోయేవారు. తొందరగా నిద్ర లేచేవారు. బద్ధకం అనేది దగ్గరకు రానిచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు అర్ధరాత్రి వరకూ పని చేసి, లేదా పనిలేకపోయినా ఇంటర్నెట్‌కి అలవాటు పడిపోయి, ఉదయం ఆలస్యంగా నిద్ర లేస్తున్నారు. నిద్ర చాలక అనేక రోగాలకు గురవుతున్నారు. 60 సంవత్సరాలకు రావలసిన కళ్ళజోడు 3, 4 సంవత్సరాల పిల్లలకు కూడా రావడానికి కారణం ఈ టీవీలు, మొబైల్ ఫోన్‌ల పుణ్యమే. వాడే వస్తువుల పైన గానీ, చుట్టూ ఉన్న పరిస్థితుల పైన గాని, చాలామందికి సరైన అవగాహన రావడం లేదు. మనుషుల్ని ప్రేమించాలి, వస్తువులను వాడాలి. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. వస్తువులను ప్రేమిస్తున్నారు. మనుషుల్ని అవసరాలకు వాడుకుంటున్నారు. పెద్ద చదువులు చదివినా సభ్యత, సంస్కారాలు ఏమాత్రం అబ్బడం లేదు. నేటి చదువులు మానవతా విలువల్ని నేర్పలేకపోతున్నాయి. టాప్ ర్యాంకర్ స్టూడెంట్స్ కూడా కేవలం ఆర్థిక కారణాలతో, విధి లేని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

### అసమర్థ పాలకుల చేతిలో జన జీవనం

ఇప్పటివరకూ చెప్పుకున్నవన్నీ మనిషి తనని తాను సంస్కరించుకుంటే చక్కబడే పరిస్థితులు. కానీ మనిషి తనని తాను ఎంత సంస్కరించుకున్నా మార్చలేని పరిస్థితులు కొన్ని ఉంటాయి. అవి పాలక పక్షం ద్వారానో, పరిపాలనా శాఖల ద్వారానో ఎదురవుతూ ఉంటాయి. ప్రస్తుతం కొందరు స్వార్థ పూరిత రాజకీయ నేతల వల్ల వారు తీసుకునే అనాలోచిత నిర్ణయాల వల్ల మన దేశంలో ప్రజల ప్రశాంత జీవనానికి భంగం వాటిల్లుతోంది. హక్కులు కాలరాయబడుతున్నాయి. దేశ ప్రజల్లో ఒకరిపై ఒకరికి విద్వేషపూరితమైన అభిప్రాయాలూ ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయం ఒక వర్గం వారిని టార్గెట్ చేసి వారిని అణగదొక్కే విధంగా ఉంటుంది. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలందరికీ సమాన న్యాయాన్ని అందించవలసిన న్యాయవ్యవస్థ సైతం స్వార్థ రాజకీయాలకు తలవంచడం ఈ దేశ ప్రజల దౌర్భాగ్యం. మంచిని మంచి అని చెడును చెడు అని నిర్భయంగా చెప్ప వలసిన మీడియా కూడా కేవలం అధికారపక్షానికి తల వంచడం, అధికారపక్షం చేతిలో రిమోట్‌లాగా పనిచెయ్యడం చాలా బాధ కలిగించే విషయం. నేటి పరిస్థితులు వికృతంగా మారిపోయినప్పటికీ తిరిగి ప్రశ్నించడానికి వీలు లేకుండా దేశద్రోహం కేసులు పెట్టడం కంటే మహాదౌర్జన్యం ఇంకోటి ఉండదు.

### కాటేస్తున్న కాలుష్యాలు..

నేడు జీవావరణమంతా పలురకాల కాలుష్యాలతో నిండిపోయింది. వాయు, జల, శబ్ద కాలుష్యాలతో కొత్త కొత్త జబ్బులు, వ్యాధులు పుట్టుకొస్తున్నాయి. వాయు కాలుష్యం కారణంగా శిశువుల్లో భారీ ఎత్తున ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తోంది. వాయు కాలుష్యం ఎక్కువ ఉన్న చోట కరోనా అవకాశాలు కూడా ఎక్కువేనని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. పరిశ్రమలు వెలువరించే కాలుష్యం కారణంగా నదులన్నీ కాలుష్య కాసారాలుగా మారిపోతున్నాయి. తాగేందుకు స్వచ్ఛమైన నీరు కూడా దొరకడం లేదు. తాగునీటిలో ఫ్లోరైడ్ పెరిగి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ప్రపంచంలో గాలి కాలుష్యం చాలా ఎక్కువ ఉన్న 30 నగరాలను తీసుకుంటే అందులో 21 నగరాలు మన భారతదేశంలోనే ఉన్నాయి. వీటిలో పరిశ్రమల కాలుష్యం 50 శాతం కంటే ఎక్కువ ఉంది.

(ఎక్స్‌పర్ట్ దాయీ గ్రూపు సభ్యులు)

# ఆ లోకంలోకి తీసుకెళ్ళండి



- షేక్ అబ్దుల్ బాసిత్ కొత్త గూడెం

**"ధనమేరా అన్నింటికీ మూలం"** అన్నాడో కవి. ధనం చెంతకు చేరిన కొద్దీ మనిషి తన జీవిత మర్మాన్ని మరచిపోతాడు. ప్రాపంచిక భోగలాలసల వెంట పరుగులు పెట్టడం మొదలుపెడతాడు. అవసరం లేని వస్తువులను కూడా కూడబెట్టుకునేందుకు ఖర్చు చేస్తాడు. తన పూర్వస్థితిని గురించి ఆలోచించకుండా భవంతులు, ఖరీదైన కార్లు, ఫాం హౌస్‌లు, ఖరీదైన దుస్తుల కోసం ధనాన్ని ధారపోస్తాడు.

నిరుపేద స్థితి నుండి ఈ స్థితికి వచ్చానే అనే ధ్యాస కూడా లేకుండా పోతుంది అతనికి. డబ్బు సంపాదన కోసం ఎంతగా కృషి చేస్తాడంటే, "వీలైనంత ఎక్కువగా ఒకరిని మించి ఒకరు ప్రపంచాన్ని పొందాలనే ధ్యాస మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరకు మీరు (ఈ వ్యామోహంలోనే) శ్మశానానికి చేరుకుంటారు" (ఖుర్‌ఆన్ 102 : 1-2). మరణాన్ని, మరణా నంతరం జీవిత పర్యవసానాన్ని మరిచిన మనిషి ధనం తన తెలివితేటలతో సంపాదించానని విర్రవీగుతాడు. ఇష్టమొచ్చిన రీతిలో ఖర్చు చేస్తాడు. దైవ అవిధేయత పనుల్లో వెచ్చిస్తాడు. సమాజంలో తన డాబును ప్రదర్శిస్తాడు.

మరణానంతరం జీవితాన్ని నమ్మేవారు తనకు లభించిన ప్రతి పైసాను అర్థవంతంగా ఖర్చుపెడతారు. పరలోకంలో పనికి వచ్చే పుణ్యాలు మూట కట్టుకోవడానికి తమ ధనాన్ని వెచ్చిస్తారు. ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (స) వారి వద్దకు వచ్చి, "అయ్యా! నేను పేదవాణ్ణి. ఏమైనా సహాయం చేయండి" అని అడిగాడు. అందుకు ప్రవక్త ముహమ్మద్(స) "ప్రస్తుతం నా వద్ద ఏమి లేదు. నువ్వు ఒక పని చెయ్యి, ఫలానా సహాబీ (అనుచరుని) దగ్గరకు వెళ్ళి నేను పంపించానని చెప్పు. నీకు తప్పకుండా సహాయం లభిస్తుంది" అని అన్నారు. ఆ వ్యక్తి ఆ సహాబీ ఇంటికి చేరేసరికి సాయంత్రమైంది. "ఇంట్లో రెండు దీపాలు ఎందుకు వెలిగించావు. ఒక దీపం సరిపోదా?" అంటూ భార్యను గద్దిస్తున్నారాయన. బయటి నుంచి ఆ మాటలు విన్న ఆ వ్యక్తి, రెండు దీపాలు వెలిగించినందుకే భార్య మీద మండిపడుతున్నారు. ఇక ఈ పిసినారి నాకేం సహాయం చేస్తారు' అని అనుకున్నాడు. ప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి తాను విన్నదంతా చెప్పాడు. అది విన్న ప్రవక్త (స) "నువ్వయితే వెళ్ళి అడుగు ఏం చేస్తారో చూడు" అని అన్నారు. ఆ వ్యక్తి నిరాశగానే వెళ్లాడు. తాను ఊహించిన దానికంటే ఎక్కువగా సాయమందింది. 'అయ్యా! ఇంతకు ముందు మీరు రెండు దీపాలు ఎందుకు వెలిగించావు' అని

మీ భార్యను గద్దించారు. ఇప్పుడేమో కోరిన దాని కంటే ఎక్కువగా సహాయం చేసారు. అదేమిటీ?" అని అడిగాడు. దానికి ఆ సహాబీ "నేను అలా పొదుపు చేయడం వల్లనే కదా మీలాంటి వారిని ఆదుకోగలుగుతున్నాను" అని చెప్పి పంపారు. పరలోక జీవితంపై విశ్వాసమున్నవారు ప్రాపంచిక లాభాల కన్నా పరలోక సాఫల్యం కోసం ఎక్కువగా ఆలోచి స్తారు.

ఒకసారి మక్కా నగరంలో తీవ్రమైన కరువు వచ్చింది. ప్రజలు ఆహార ధాన్యాల కోసం అలమటిస్తున్నారు. ఆ సమయంలో హజ్రత్ ఉస్మాన్ ఘనీ (రఅ) తన వ్యాపారం ముగించుకుని ఒంటెల మీద ఆహార ధాన్యాల బస్తాలతో మక్కా నగరం తిరిగి వచ్చారు. వ్యాపారులంతా ఆయన ఇంటికి వెళ్ళి, "అయ్యా! మీ ధాన్యం మాకు అమ్మండి. మేము మీకు మూడు నాలుగు రెట్లు అధికంగా చెల్లిస్తాం" అని అన్నారు. "క్షమిం చాలి. నేను నా ధాన్యాన్ని మీకు అమ్మలేను. ఏడువందల రెట్లకు ముందే ఒప్పందం కుదుర్చుకున్నాను" అని సమాధానం ఇచ్చారాయన. మీరు ప్రవక్త (స) ముఖ్య అనుచరులై ఉండి, ఒక వైపు ప్రజలేమో ఆకలితో అలమటి స్తుంటే మీరు అధిక లాభాల కోసం చూస్తారా? వ్యాపారు లంతా నిలదీసినట్లు అడిగారు. మీ ధాన్యాన్ని ఏడు వందల రెట్లకు కొనే వ్యాపారి ఎవరు? అని వ్యాపారులంతా ఆతృతతో అడిగితే.. ఆగండి కాసేపు మీకే తెలుస్తుంది అని అన్నారు ఉస్మాన్ ఘని (ర). కాసేపటి తర్వాత ఆయన ఇంటి ముందు ప్రజలంతా బారులు తీరి నిలబడి ఉన్నారు. బస్తాలలో ధాన్యాన్ని మోసుకుని వెళుతున్నారు. అప్పుడు తెలిసింది ఆ వ్యాపారులకు ఆయన ఉచితంగా దానం చేసారని.

సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసే వారి ఉపమానం ఇలా ఉంటుంది: 'ఒక్క విత్తనాన్ని నాటితే, అది మొలిచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతి వెన్నుకూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదేవిధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింపచేస్తాడు'. (ఖుర్ఆన్- 2: 261)

పరలోకం పై విశ్వాసం కలవారు ప్రాపంచిక లాభాల కోసం చూడరు. శాశ్వతమైన పరలోక జీవితంలో పనికి వచ్చే పుణ్యాల కోసం వినియోగిస్తారు. ఎందుకంటే ప్రాపంచిక సంపద చనిపోయాక వెంట తీసుకుని వెళ్ళలేము కదా! ❖

# నిజసారం

కష్టాలు ఎదురయినంత మాత్రాన...
కష్టం ఎంతో కాలం
నిలువదన్నది తెలిసీ
చెడుకాలం అని పేరు పెట్టడం
ఎంత దౌష్ట్యం?
ఆ ఎరుకే
ఆశల సౌధానికి సోపానం!

సుఖమూ ఎన్నో రోజులు
మనజాలదన్నదీ వాస్తవం...
మరి మంచి రోజులూ
సరయిన నామకరణమా?
మనిషి వినమ్రుడయి మనడానికి
దారి సుగమం!!

జీవన యానంలో
ఎత్తు పల్లాలు
కష్ట సుఖాల ఈ సంగమానికి
చీకటి వెలుగులు
వసంత గ్రీష్మాలు
ఆనవాలు!
సమరస సమతులనాలే
నిజసారం సంసారం !!

**- ఎస్.ఎమ్. మలిక్**

- అబూ రైహాన్




# క్యాలెండర్ మారింది... జీవితం మారిందా?

సంవత్సరం చివర్లో అదేవిధంగా సందర్భానుసారం మన ఆచరణలను పరిశీలించుకుంటూ ఉండాలి. ఎన్ని పుణ్యాలు చేశాము? ఎన్ని పాపాలు చేశాము? ఇహపరాలలో పనికొచ్చే, పరలోకంలో వాటిని చూసుకుని సంతోషించేటటువంటి ఆచరణలు ఏమన్నా ఉన్నాయా? తప్పిదాలు, పొరపాట్ల వల్ల ఇహపరాలను నష్టపరచుకునే ఆచరణలు ఏవయినా చేశామా? అల్లాహ్‌కు విధేయత కలిగి ఉండడాన్ని పెంచామా లేదా తగ్గించామా అనేవి పరిశీలించుకోవాలి.

అంతేకాదు, మన నమాజులు, ఉపవాసాలు, సదఖాలు తదితరాలు సరిగ్గా పాటిస్తున్నామా లేదా? మన వ్యవహారశైలిలో మార్పు వచ్చిందా లేదా? మనం నేర్చుకున్న విద్యను ఇతరుల వరకు చేరుస్తున్నామా లేదా? అనే విషయమూ పరికించుకోవాలి.

వివిధ దేశాలు, కంపెనీలు, సంస్థలు యేడాదికి ఒకసారి లాభనష్టాల గురించి బేరీజు వేసుకుంటాయి. లాభనష్టాలకు గల కారణాలను తెలుసుకుంటాయి. నష్టాల నుంచి బయటపడటానికి ప్రణాళికలు రచిస్తాయి. అదేవిధంగా మనమూ ఏడాదికొకసారయినా లేదా సందర్భానుసారం ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇహపరాలలో సాఫల్యం ఎలా సాధించాలి? పిల్లలను ఏవిధంగా తీర్చిదిద్దాలి? ప్రళయం రోజు మన ఆచరణల పత్రం కుడిచేతిలో ఎలా లభిస్తుంది? నరకాగ్ని శిక్ష నుండి ఎలా తప్పించుకోవాలి? ఇలాంటి విషయాలను మనం ప్రతి యేడు ప్రతి నెలా ప్రతి వారం ప్రతి రోజు పరిశీలించుకోవాలి.

కొత్త యేడాది రాగానే శేష జీవితం అల్లాహ్ అభీష్టం మేరకు గడపాలనే దృఢ సంకల్పం చేసుకోవాలి. ఇప్పుడు మనం సజీవంగా ఉన్నాము. మన ప్రాణాన్ని తీయడానికి మృత్యుదూత ఎప్పుడు వస్తాడో ఎవరికీ తెలియదు. మనం ఈ ప్రపంచంలో గడిపిన ప్రతిక్షణం గురించి అల్లాహ్‌కు జవాబు చెప్పుకోవలసి ఉంది. దానిని దృష్టిలో ఉంచుకుని జీవితం గడపాలి.

ఇంకా సమయం మించిపోలేదు. మృత్యువు ఎప్పుడయినా సంభవించవచ్చు. చేసిన పాపాలకు గాను పశ్చాత్తాపం చెంది సదాచరణల వైపు పురోగమించాలి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "విశ్వసించిన ప్రజలారా! మీరంతా కలసి అల్లాహ్ వైపునకు మరలి క్షమాభిక్ష వేడుకోండి. మీకు సాఫల్యం కలగవచ్చు."

(అన్ నూర్: 31)

తనువు చాలించిన తరువాత మళ్ళీ సదాచరణలు చేసే అవకాశం ఉండదు. ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా సెలవీయడం జరిగింది: "ఓ నా ప్రభూ! నేను వదలిపెట్టి వచ్చిన లోకానికే నన్ను తిరిగి పంపెయ్యి. ఇక నేను మంచి పనులు చేస్తానని ఆశిస్తున్నాను.' ఇది ఎంత మాత్రం జరిగేది కాదు. అతడు పలికేది కేవలం ఒక మాట మాత్రమే. ఇప్పుడు ఈ (మరణించేవారి) అందరి వెనుక ఒక గోడ అడ్డంగా ఉన్నది. అది మరొక జీవితం వచ్చే రోజు వరకు ఉంటుంది". (అల్ మూ'మినూన్ : 99, 100)

కనుక నమాజ్, రోజాలు తప్పకుండా పాటించాలి. విధి అయితే జకాత్ చెల్లించాలి. ప్రతిరోజు ఖుర్‌ఆన్ పారాయణం చేయడం అలవరచుకోవాలి. కేవలం ధర్మసమ్మతమయిన మార్గంలోనే సంపాదించాలి. పిల్లలకు ధార్మిక విద్యనందించాలి. వారిని సుగుణవంతులుగా తీర్చిదిద్దాలి. దైవాదేశాలను పాటించడంతో పాటు అల్లాహ్ ఏ విషయాల నుంచి వారించాడో వాటికి దూరంగా ఉండాలి. టీవీ, నెట్‌ను దుర్వినియోగం చేయకుండా మనమూ దూరంగా ఉండాలి. పిల్లలనూ దూరంగా ఉంచాలి. వీలయినంత వరకు ప్రవక్త(స) సంప్రదాయాలను మన జీవితాల్లోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నించాలి.

రెండు ఆరాధనలు చేసి మనం దైవ సామీప్యం పొందగలము. ఒక ఆరాధన అల్లాహ్ అస్తిత్వానికి సంబంధించింది. దానిని రాత్రి తహజ్జుద్ రూపంలో నిర్వర్తించవచ్చు. చలికాలం గురించి హదీసుల్లో విశ్వాసుల కొరకు ఇది రబీ కాలం లాంటిది అని పేర్కొనడం జరిగింది. రాత్రి సుదీర్ఘంగా ఉంటుంది. కనుక ఈ కాలంలో విశ్వాసి తహజ్జుద్ నమాజ్ చేస్తాడు. పగలు చిన్నదిగా ఉంటుంది. కనుక ఉపవాసాలు ఉంటాడు. నిశ్చయంగా చలికాలంలో రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది. కనుక కొన్ని రాత్రుల తహజ్జుద్ నమాజ్ చేయడం మనకోసం సులువే. ఖుర్‌ఆన్‌లో ఫర్జ్ నమాజ్‌ల తరువాత తహజ్జుద్ నమాజ్ గురించే తాకీదు చేయడం జరిగింది.

చలికాలంలో మనం చేయాల్సిన ముఖ్య కార్యం దైవదాసుల సేవ. దీని ఉత్తమ పద్ధతి ఏమిటంటే నిరుపేదలు, అభాగ్యులు, అనాథులు, వితంతువులు, అవసరార్థులకు చలినుంచి రక్షించ డానికి దుప్పట్లు, కంబళ్ళు, వెచ్చదనాన్నిచ్చే దుస్తులు అందించాలి.

మనిషి జీవితం గడిచేకొద్దీ తాను పెద్దవాడినవుతున్నాను అనుకుంటాడు. కాని మనిషి చిన్నవాడవుతూ ఉంటాడు. ప్రతి కొత్త యేడు మనకు 365 రోజులు, 52 వారాల కాలం ఇస్తుంది. ఈ కాలంలో నువ్వేం చేయదలచుకున్నావో అది చేసుకో అంటుంది. ఇది అవకాశాల ప్రపంచం. ఇక్కడ విస్తృత అవకాశాలు ఉంటాయి. ప్రపంచంలో అసాధ్యమనేది ఏదీ లేదు. గమ్యాలను చేరుకునే ప్రపంచం ఇది. అవకాశాలను అందిపుచ్చుకోవాలను కుంటే దృఢ సంకల్పాలు చాలా అవసరం. ఇక్కడ అందరికీ సమాన అవకాశాలు ఉంటాయి. వాటిని సద్వినియోగం చేసుకున్న వారు విజయాలను సాధిస్తారు. లేదంటే ఈ యేడు కూడా వృథా అయిపోతుంది. వాస్తవం ఏమిటంటే మనం క్యాలెండర్ మారు స్తుంటాం కానీ మనసులను మార్చుకోము. మన ఆలోచనా తీరును మార్చుకోము. గతంలో లేనిది మనం ఏం పొందాము, ఏం నేర్చుకున్నాము అని ఆలోచించము. మన దగ్గర ఉన్నది ఏం కోల్పోయామో తెలుసుకోము. అందుకే జీవితం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మాదిరిగా అయిపోతుంది. కనుక ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకుంటూ జీవితాన్ని అందంగా తీర్చిదిద్దుకోవాలి.

❖

## చెప్పులు లేకపోతే రెండు కాళ్ళున్నాయిగా!

ఒకసారి షేఖ్ సాదీ (రహ్మ) విద్యార్జన కోసం షీరాజ్ నుంచి బగ్దాద్‌కు ప్రయాణం అయ్యారు. బగ్దాద్, షీరాజ్ నుంచి చాలా దూరం. ఆయన బగ్దాద్‌కు నడుచుకుంటూ వెళ్ళసాగారు. నడుస్తూ నడుస్తూ ఆయన చెప్పులు తెగిపో యాయి. ముందుకు సాగడం కష్టంగా ఉంది. ఆయన పాదరక్షలు లేకుండా ఉత్తి కాళ్ళతోనే నడక సాగించారు. నడుస్తూ నడుస్తూ ఆయన కాళ్ళకు గాయాలయ్యాయి. ఇక నడవడం భారంగా ఉంది. అలసిపోయి ఒకచోట కూర్చున్నారు. నా దగ్గర డబ్బులుంటే నడుచుకుంటూ వెళ్ళే పరిస్థితి వచ్చేది కాదు. చెప్పులు తెగి గాయాలయ్యేవి కాదు అని ఆలోచిస్తుండగానే ఒక వికలాంగుడు కనబడ్డాడు. అతని రెండు కాళ్ళూ లేవు. అతను లేచి నిలబడలేని పరిస్థితి. అయినప్పటికీ అతను ఈడ్చుకుంటూ వెళుతున్నాడు. ఈ దృశ్యాన్ని చూసి ఆయన అల్లాహ్‌కు క్షమాపణలు కోరుకు న్నారు. ఆ తరువాత తన రెండు కాళ్ళు సురక్షితంగా ఉన్నందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. "నేను నడవగలను. నా దగ్గర డబ్బులు లేకపోతే ఏమైంది. నా రెండు కాళ్ళు ఉన్నాయి. ఓ అల్లాహ్! నీకు వేనవేల కృతజ్ఞతలు" అనుకుంటూ మళ్ళీ నడక ప్రారంభించారు.



- మంగళగిరి జీలాని

# దీపమున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకో!

నాగరికతల అభివృద్ధి, దేశాల భవిష్యత్తు యువత చేతుల్లో ఉంటుంది. మనిషి జీవితంలో యవ్వనం కీలక దశ. ఏ పనినైనా చేయగలిగే శక్తి, సామర్థ్యం, ఉత్సాహం కలిగి ఉండే దశ. భవిష్యత్తును నిర్ణయించుకునే దశ. ఎంచుకున్న మార్గం సరైనది అయినా చెడు మార్గమైనా తనకంటూ ఒక గుర్తింపు కోసం పరితపించే వయసు. నైతికత, ఆధ్యాత్మిక విలువలు మనిషి వ్యక్తిత్వానికి మూలాలు. యువత తమ వ్యక్తిత్వ నిర్మాణంలో ఈ మూలాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. యువత మంచి వ్యక్తిత్వాన్ని పొందడంలో వారి తల్లిదండ్రులు పోషించే పాత్ర అత్యంత కీలకమైనది.

మొక్కై వంగనిది మానై వంగుతుందా? కనుక చిన్నప్పటి నుంచే వారికి సరైన దిశా నిర్దేశనం చేయాలి. వెయ్యిమైళ్ళ దూరమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది అనేది నిజం. కానీ మన మొదటి అడుగు తప్పుడు మార్గంలో పడితే జీవితం అంతా తప్పుడు మార్గంలో గడిచిపోతుంది. తిరిగి సరైన మార్గంలో రావడం చాలా కష్టమవుతుంది.

దైవ సందేశహరుడు(స) ఈ విధంగా సెలవిచ్చారు : ఏ రోజు అల్లాహ్ తప్ప వేరే నీడ లభ్యం కాదో ఆ రోజు అల్లాహ్ ఏడు రకాల మనుషులకు తన నీడలో ఆశ్రయమిస్తాడు.

1) న్యాయశీలుడైన పాలకునికి 2) తన యవ్వనాన్ని దైవ విధేయత, దైవారాధనలో గడిపిన యువకునికి 3) మస్జిద్‌లోనే తన మనస్సు లగ్నం చేసుకున్న వ్యక్తికి- ఇతను మస్జిద్ నుండి వెలుపలికి రాగానే మస్జిద్‌లోకి వెళ్ళడానికి నిరీక్షిస్తూ ఉంటాడు 4) దైవం, దైవధర్మం కొరకు మాత్రమే మైత్రి ప్రేమాభిమానాలు గల ఇద్దరు వ్యక్తులకు- వారు దైవం కొరకే కలుసుకుంటారు, దైవం కొరకే వేరవుతారు 5) ఏకాంతంలో దైవదాస్యం చేసుకుంటూ ఉండగా అతని కళ్ళ నుండి కన్నీరు కారినటువంటి వ్యక్తికి 6) ఉన్నత వంశీయుల అందమైన యువతి దుష్ట క్రియకు ఆహ్వానిస్తే కేవలం దైవభీతితో ఆ ఆహ్వానాన్ని త్రోసిపుచ్చిన వ్యక్తికి 7) రహస్యంగా దానధర్మాలు చేసే వ్యక్తికి- తన కుడిచెయ్యి దానం చేసినదేమిటో ఎడమ చేయికి తెలియని వ్యక్తికి (ముత్తఫకున్ అలైహ్- అబూహురైరా)

ఈ హదీసునుబట్టి ప్రవక్త ముహమ్మద్(స) యువతకు ఇచ్చిన ప్రాముఖ్యతను మనం సులభంగా అర్థం చేసుకోవచ్చు. షైతాను వ్యక్తిపై సులభంగా నియంత్రణ సాధించి తప్పుడు మార్గంలో నడిపించే దశ ఈ యవ్వన దశ. కనుక యవ్వన దశలో వ్యక్తి తాను చేసే వివిధ కార్యకలాపాలపై ఎక్కువ స్పృహ కలిగి ఉండాలి. మనం షైతానుకు ఇచ్చిన చిన్న అవకాశం మనపై స్వారీ చేయడానికి అవకాశం కలిగిస్తుంది అని గ్రహించాలి.

ముస్లిం యువత దృష్టి సారించాల్సిన మూడు సాధారణ అంశాలు ఈ క్రిందివిధంగా ఉన్నాయి.

1) తల్లిదండ్రులకు విధేయత, గౌరవం చూపడం.

2) సమయాన్ని సమర్థవంతంగా ఉపయోగించడం (సమయాన్ని వృథా చేయకుండా గడపడం).

3) ఇస్లాం నిషేధించిన వాటి దరిదాపులకు కూడా వెళ్ళకుండా (నిష్ఠగా) జీవితం గడపడం.

యవ్వనంలో తమకు ప్రతిది తెలుసునని అనుకుంటారు. కొందరు తమ తల్లిదండ్రులకన్నా ఎక్కువ తెలుసు అనుకుంటారు. ఈ వైఖరి కారణంగా వారు తల్లిదండ్రులకు అవిధేయత చూపు తారు. పిల్లలు ఒక నిర్దిష్ట రంగంలో ఎక్కువగా జ్ఞానాన్ని పొందవచ్చుకానీ, అనుభవపరంగా వారు తమ తల్లిదండ్రుల కంటే ఎప్పుడూ చిన్నవారే. తల్లిదండ్రులు మనకన్నా ఎక్కువ అనుభవజ్ఞులుగా గ్రహించి, గౌరవించాలి.

మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా అన్నారు: "చాలామంది కోల్పోయే రెండు వరాలు ఉన్నాయి. (అవి) ఆరోగ్యం, మంచి చేయడానికి ఉన్న ఖాళీ సమయం" (బుఖారీ)

ఈ హదీసునుబట్టి మనం అల్లాహ్ ఇచ్చిన అనేక అనుగ్రహాలలో ఖాళీ సమయం, ఆరోగ్యం విలువైన అనుగ్రహాలు అని అర్థం చేసుకోవచ్చు. వాటిని సరైన ప్రయోజనం కోసం ఉపయోగించాలి. సమయం ప్రాముఖ్యతను అల్లాహ్ సూరా అల్ అస్ర్‌లో నొక్కి చెప్పాడు. కానీ చాలా మంది యువత ఇస్లాం ఇష్టపడని, నిషేధిం చిన పనులలో సమయాన్ని వృథా చేయడం చూస్తున్నాం. ఇది చాలా బాధాకరమైన విషయం.

హజ్రత్ అలీ ఇబ్ను అబీ తాలిబ్(రజి) ఇలా అన్నారు : "ప్రజలు వాటిని కోల్పోయేంత వరకు వాటి గొప్పతనాన్ని గుర్తించని రెండు విషయాలు ఉన్నాయి. అవి యవ్వనం, మంచి ఆరోగ్యం".

మన కోరికలపై పూర్తి నియంత్రణ లేని యుగం ఇది. ఉదాహరణకు స్మార్ట్ ఫోన్, వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి ఎన్నో సామాజిక మాధ్యమాలలో యువకులు తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. యువతీ యువకుల యవ్వన దశలో అశ్లీల మార్గాలు, ధూమపానం, మత్తు పదార్థాలు, మద్యం మొద లైన చెడు వ్యసనాలకు, సావాసాలకు అలవాటు పడుతున్నారు. యువత వీటి పట్ల ఆకర్షితులవుతున్నారు. బానిసలు అవుతున్నారు. ఇది కొంతకాలం వరకు మనకు భౌతిక ఆనందాన్ని ఇవ్వవచ్చు. కాని పరలోకంలో ఖచ్చితంగా నష్టదాయకం.

"ఆయనే, తన ప్రవక్తను మార్గదర్శకత్వంతో, సత్యధర్మంతో అన్ని ధర్మాలపై అది ఆధిక్యత కలిగి ఉండేలా చేసి పంపాడు. సాక్షిగా అల్లాహ్‌యే చాలు." (ఖుర్‌ఆన్ 48: 28)

ప్రవక్త(స) లక్ష్యం ఏమిటో ఈ వాక్యం ద్వారా మనం తెలుసుకో వచ్చు. ఇది ప్రతి ముస్లిం లక్ష్యం కూడా. కాని నేటి యువత ఎటువంటి లక్ష్యం లేకుండా జీవిస్తున్నారు. వారు తమ భౌతిక కోరికలు తీర్చుకోవడమే ప్రాథమిక లక్ష్యంగా జీవిస్తున్నారు.

మహాప్రవక్త(స) ఒక వ్యక్తిని ఉపదేశిస్తూ ఇలా అన్నారు : "నీవు ఐదు విషయాలను మరో ఐదు విషయాల కంటే ఎంతో మేలయిన వని తెలుసుకో- వృద్ధాప్యం రాకపూర్వమే యవ్వనాన్ని, వ్యాధి రాకపూర్వమే ఆరోగ్యాన్ని, లేమి దాపురించక పూర్వమే కలిమిని, పనులు వచ్చి పడకముందే తీరికను, మృత్యువుకు పూర్వమే జీవితాన్ని గుర్తించు." (మిష్కాత్)

ముస్లిం యువత తమ ప్రతిభ, సమయం, ధనం ద్వారా సమాజా నికి సహాయపడాలి. సమాజంలో సానుకూల మార్పు తీసుకు రావడానికి వారు ముఖ్యమైన పాత్రను పోషించాలి. ఇస్లామీయ జీవన విధానం తమ జీవితాలలో ప్రతిబింబించాలనే లక్ష్యంతో కృషి చేయాలి. వారు ధార్మిక, ప్రాపంచిక (మంచి) జ్ఞానాన్ని నేర్చుకోవడం, ఇతరులకు నేర్పించడం ద్వారా అల్లాహ్ తమకు ఇచ్చిన సమయాన్ని, ప్రతిభను సమర్థవంతంగా ఉపయోగించు కోగలరు. దీనిపై కృషి చేయడం ద్వారా యవ్వనం జీవితంలో ఉన్నతమైనదిగా మారుతుంది.

ఈ రోజు మన దగ్గర ఉన్నదంతా అల్లాహ్ మనకు ప్రసాదించినదే. మన ప్రాణం, ధనం... ప్రతిది అల్లాహ్‌కు చెందినదేనని మనందరం గుర్తుంచుకోవాల్సిన విషయం. కనుక మనం అన్నింటిని ఖర్చు చెయ్యాలి. అల్లాహ్ ప్రసన్నత పొందాలనే ఏకైక లక్ష్యంతో మంచి పనులు చేయాలి.

ముస్లిం యువత ఖుర్‌ఆన్, ప్రామాణికమైన హదీసుల నుండి సరైన ఇస్లామీయ జ్ఞానాన్ని నేర్చుకోవడం ద్వారా ఇస్లాంను సరైన దృక్పథంలో అర్థం చేసుకోవచ్చు.

యవ్వనం అనేది మన జీవిత నిర్మాణానికి లేదా విచ్ఛిన్నానికి కారణమవుతుంది. కాబట్టి యవ్వనాన్ని జీవన నిర్మాణానికి ఉపయోగించాలి. ❖

# సుఖాలను త్యజించనవసరం లేదు!

- నసీరా బేగం

మనిషి ప్రాపంచిక సుఖాలను త్యజించనంతవరకు అతను దైవ విధేయుడు, దైవ ప్రేమికుడు కాలేడు అనే భావన ఆది నుంచే కొంతమందిలో గాఢంగా ఉంది. దాని కారణంగా వారు బంధాల న్నింటినీ త్రెంచుకుని, రుచులన్నింటినీ వదులుకుని తమ చుట్టూ తాము గీతను గీసుకుంటారు. ప్రత్యేకమైన వాతావరణాన్ని, ప్రత్యేకమైన వస్త్రధారణను ఎంచుకుంటారు. ఈ విధంగా తాము ఎన్నో త్యాగాలను దేవుని కోసం చేస్తున్నామని, దేవుడు తమకు ప్రత్యేకమైన స్థానాలను ఇహపర లోకాలు రెండింటిలోను ప్రసాది స్తాడని భావిస్తూ ఉంటారు. వారిని చూసిన మరికొంతమంది వారిని గురించి వారు ప్రత్యేకమైన దైవదాసులని, దేవుడు వారిని ప్రత్యేకంగా చూస్తాడని, తాము వారికంటే అల్పులమని, కనుక వారిని సేవిస్తే తమకు మోక్షం లభిస్తుందనే భ్రమలో ఉంటారు. మనిషి జీవితం పరీక్ష అని, వారికి పెట్టబడిన ఈ పరీక్ష మరీ అంత కఠిన మైనదీ కాదని, మరీ అంత సులువైనదీ కాదని, అతను ధర్మసమ్మతంగా చెయ్యబడిన వాటన్నింటినీ హద్దులను అతిక్ర మించకుండా ఆస్వాదించవచ్చని, బంధుత్వాల ద్వారా సుఖ దుఃఖాలు లభిస్తాయని వాటి ద్వారా సుఖాలు అనుభవించి దుఃఖా లను ఎదుర్కోవాలని, ఇందులోనే సుఖమూ, పరీక్ష రెండూ ఉంటాయని బోధిస్తుంది. దివ్య ఖుర్‌ఆన్ ఇలా ప్రకటిస్తోంది:

ఆదమ్ సంతానమా! ప్రతి ఆరాధనా సమయంలో మీ వస్త్రాలంక రణ పట్ల శ్రద్ధ వహించండి. తినండి, త్రాగండి, మితిమీరకండి. అల్లాహ్ మితిమీరే వారిని ప్రేమించడు. ప్రవక్తా! వారితో ఇలా అను: అల్లాహ్ తన దాసుల కొరకు ఉద్భవింపజేసిన మంచి వస్త్రాలను ఎవరు నిషేధించారు? ఇంకా అల్లాహ్ ప్రసాదించిన పరిశుద్ధ వస్తువులను నిషేధించింది ఎవరు? ఇలా అను: ఈ వస్తువులన్నీ ఇహలోక జీవితంలో కూడా విశ్వాసుల కొరకే, ప్రళయం నాడు ప్రత్యేకంగా వారి కొరకు మాత్రమే. జ్ఞానం కలవారికి ఈ విధంగా మేము మా మాటలను స్పష్టంగా చెబుతున్నాము. ఇంకా ప్రవక్తా! వారితో ఇలా అను: నా ప్రభువు నిషేధించినవి ఇవి : సిగ్గుమాలిన పనులు- బహిరంగమైనవి కాని, లేక గుప్తమైనవి కాని- పాపాలు సత్యానికి వ్యతిరేకంగా మేరమీరటం, అల్లాహ్ ఏ ప్రమాణాన్నీ అవతరింపజేయకపోయినా మీరు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా కల్పించటం, (వాస్తవంగా అల్లాహ్‌యే అన్నాడని) మీకు తెలియని విషయాన్ని మీరు అల్లాహ్ పేరుతో చెప్పటం''. (దివ్య ఖుర్‌ఆన్ 7 : 31-33)

మనిషి జీవితం ముగ్గురి హక్కులతో ముడివడి ఉంటుంది. ఈ హక్కుల నిర్వహణలో సంతోషం సుఖం అంతర్లీనమై ఉంటుంది. మొట్టమొదట మనిషి సృష్టికర్త, యజమాని అయిన అల్లాహ్ హక్కులను నెరవేర్చాలి. అంటే ఆయన్ని మాత్రమే విశ్వసించాలి, ఆయన ఆజ్ఞలను మాత్రమే పాలించాలి. ఆ తరువాత తనపై తనకున్న హక్కులను గుర్తించాలి, ఆచరించాలి. అల్లాహ్ ఈ

ప్రపంచం మొత్తాన్ని, ప్రపంచంలో ఉన్న సమస్త వస్తువులను కేవలం మనిషి కోసమే సృష్టించాడు. ఆ విషయాన్ని గుర్తించి, దాని ద్వారా కలిగే లాభాలన్నింటినీ పొందాలి. దానిద్వారా కలిగే నష్టాలన్నింటికీ దూరంగా ఉండాలి. ఇదే అసలైన దైవభక్తి. మనిషి వస్త్రాలంకరణ పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని బోధించాడు అల్లాహ్. అంటే దేవుడు ప్రసాదించిన వాటిలో నుంచి స్థోమతకు తగ్గట్టుగా మంచి వస్త్రాలు, పరిశుభ్రమైన, గౌరవప్రదమైన వస్త్రాలు ధరించాలి. దీనిద్వారా మనిషిలో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. ఎల్లప్పుడూ ఒకే రకమైన వస్త్రాలు కాకుండా కొత్త కొత్త రకాలు ధర్మసమ్మతమైన వాటిని ఎంచుకోవచ్చు. దీనిద్వారా మనిషి తాను సమాజంలో వెనుకబడిన వారిలోని వాడిని కాదని, తాను అందరితో సమానంగా ఉన్నాననే భావన కలుగుతుంది. ఈ భావనను ఇస్లామ్ ఏ విధంగానూ అణచదు. పైగా ప్రోత్సహిస్తుంది. అతనిలో కలిగే ఈ భావన అతని పురోగతిని సాధించటానికి తోడ్పడుతుంది. అదేవిధంగా రకరకాల వంటలను, పండ్లను కూడా తినమని అనుమతిస్తోంది. ఎందుకంటే అల్లాహ్ మనిషి కోసం పండించిన పంటలలో రకరకాల శక్తులను గోప్యంగా ఉంచాడు. ఇంకా ఆయన మనిషి హృదయంలో అవి తినాలనే కోరికను కూడా పుట్టించాడు. ఎందుకంటే మనిషి తన ఇష్టప్రకారం తిని శక్తిని పొంది సంతోషంగా ఉండాలని ఆ శక్తిసామర్థ్యాలను వినియోగించి సమాజానికి సకల విధాల తోడ్పడాలని. కాని ఆయన వాటిలో హద్దులను అతిక్రమించకూడదని ఒక షరతు పెట్టాడు. ఇదీ మానవ జాతి మంచి కోసమే. హద్దులను అతిక్రమించిన వాడు విచక్షణను కోల్పోతాడు. విచక్షణా రహితంగా ప్రవర్తిస్తాడు. విచక్షణా రహితంగా మానవజాతి ప్రవర్తించడం మానవ వికాసానికే అడ్డుపడుతుంది. ఆ తరువాత మూడో విషయం మనిషి సామాజిక బాంధవ్యాలను గుర్తించి వారి పట్ల ఉత్తమంగా వ్యవహరించటం. అల్లాహ్ గనక కోరినట్లయితే అందరి అవసరాలన్నింటినీ ఆయనే నెరవేర్చగలడు. ఆయన ఈ పద్ధతిని ఎంచుకోలేదు. ఒకరి అవసరాలను ఒకరు తీర్చుకోవాలనే నిబంధనను పెట్టాడు. ఇందులో కూడా అత్యంత వివేకం అంతర్లీనమై ఉంది. ఎందుకంటే ఒకరికొకరు తోడ్పడుతూ ఉంటే ఒకరికి మరొకరితో దగ్గరి బంధుత్వం ఏర్పడుతుంది. ఒకరి అవసరాలు మరొకరు తీర్చుకుంటూ ఉన్న కారణంగా ఒకరి గురించి మరొకరి హృదయాలలో ప్రేమానురాగాలు జనిస్తాయి. ఒకరికి మరొకరు తోడుగా ఉన్నారనే భావన బలపడుతుంది. ఇది మనిషి గుండెలో ధైర్యాన్ని నింపుతుంది. ఈ ధైర్య స్థైర్యాలు, ప్రేమానురాగాలు సామాజిక జీవనానికి దోహదమవుతాయి. కనుకనే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతో మంది స్త్రీ పురుషులను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయ పడండి. బంధుత్వ సంబంధాలను తెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి.''

(దివ్య ఖుర్ఆన్ : 4: 1)

వీటన్నింటి ద్వారా తెలిసిన విషయమేమిటంటే, మనిషి దైవ విధేయుడు, దైవ ప్రేమికుడు కావాలనుకుంటే సామాజిక జీవితంలో తమను తాము ప్రత్యేక హద్దుల్లో పెట్టుకోకుండా అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమించకుండా, తగ్గించుకోకుండా ప్రయోజనాలన్నింటినీ ఉపయోగించుకుంటూ జీవించాలి. దీనికోసం కార్యరూపంలో దైవప్రవక్త(స) గారి జీవితాన్ని నిదర్శనంగా చేసుకోవాలి.

దైవప్రవక్త(స) గారి కాలంలో కూడా ముగ్గురు అనుచరులు ప్రత్యేకంగా హద్దులను నియమించుకున్నారు. ఒకరు నేను ఎల్లప్పుడు ఉపవాసాన్నే పాటిస్తానని నిర్ణయించుకున్నారు. మరొకరు నేను రాత్రిళ్ళు నిద్రను నిషేధించుకుంటానని, ఇంకొకరు నేను వివాహమే చేసుకోనని నిర్ణయించుకున్నారు. దీనిద్వారా దైవ సామీప్యాన్ని ప్రత్యేకంగా పొందవచ్చని భావించారు. ఈ విషయం దైవప్రవక్త(స)కు తెలియగానే ఆయన(స) వారిని పిలిచి వారించారు. మీరు నన్ను అనుసరించండి. నేను అప్పుడప్పుడు ఉపవాసాలను పాటిస్తాను, విరమిస్తాను కూడా. రాత్రిళ్ళు జాగారం కూడా చేస్తాను, పడుకుంటాను కూడా. నేను వివాహాలు చేసుకున్నాను కూడా. దీనిద్వారా తెలిసిన విషయమేమిటంటే, మనిషి తన మేథను ఉపయోగించకుండా దైవాజ్ఞలను ఆచరించినట్లయితేనే ఇహపరలోకాల ముక్తీ మోక్షాలు తన సొంతమవుతాయి. ❖

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




## యుపిలో ముస్లిం యువకుడిపై బలవంతపు మతమార్పిడి కేసు

ముగ్గురు ముస్లిం యువకులపై బలవంతపు మతమార్పిడి కేసు నమోదు చేసిన రెండు రోజుల తరువాత కేసును పొరపాటుగా నమోదు చేశామని ఉత్తరప్రదేశ్ పోలీసులు వెల్లడించారు. సెప్టెంబరు 9, 2020న ఒక మహిళ ముస్లిం యువకుడు అబ్రార్‌తో వెళ్లిపోయి 15 రోజుల తరువాత ఇంటికి తిరిగి వచ్చింది. మహిళ, ఆమె మావయ్య ఫిర్యాదు ప్రకారం ఈనెల 1న ముస్లిం యువకులు అబ్రార్, మైసుర్, ఇర్షాద్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివాహం కోసం బలవంతంగా మతం మార్చ డానికి ప్రయత్నించారని ఆరోపించారు. పోలీసుల విచారణ, సాక్ష్యాధారాల ప్రకారం ఈ ముగ్గురు ముస్లిం యువకులు ఆ రోజు సంఘటనా స్థలంలో లేనట్లు వెల్లడయింది. దీంతో వారిపై తప్పుడు ఆరోపణలతో కేసు నమోదు చేశామని, చట్ట ప్రకారం ఈ కేసు కొట్టివేయబడుతుందని బర్‌లీ ఎస్ఎస్‌పి రోహిత్ సింగ్ సజ్వాన్ తెలిపారు. తిరిగి వచ్చిన మహిళ డిసెంబరు 11న తన మావయ్యను వివాహం చేసుకుంది.

## మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ముహమ్మద్ రఫీక్



మధ్యప్రదేశ్ హైకోర్టు 26వ ప్రధాన న్యాయమూర్తిగా ముహమ్మద్ రఫీక్ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఇన్‌చార్జి గవర్నర్ ఆనందీ బెన్ పటేల్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముహమ్మద్ రఫీక్ గతంలో ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. గతేడాది 31న ఆయన మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా బదిలీ అయ్యారు. ముహమ్మద్ రఫీక్ 1960, మే 20న రాజస్థాన్‌లోని చురూ జిల్లా సుజాన్‌ఘర్‌లో జన్మించారు. రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి కాకముందు ఆయన మే 15, 2006 వరకు ప్రాక్టీస్ లాయర్‌గా కొనసాగారు. నవంబర్ 30, 2019 వరకు మధ్యప్రదేశ్ హైకోర్టులో 3,81,641 పెండింగ్ కేసులు న్నాయి.

## బీజేపీ అనుచరుల చేష్టలు ఆమోద యోగ్యం కాదు

కర్నాటకలో గోవధపై కఠినమైన చట్టాలు చేసిన తరువాత ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధ రామయ్య నిర్భయంగా బీజేపీ, ఆ పార్టీ అనుచరులకు 'నాకు బీఫ్ అంటే చాలా ఇష్టం. నేను దానిని తింటాను. తినకుండా అడ్డుకోవడానికి మీరెవరు?'' అని కరాఖండిగా చెప్పేశారు. మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన 'నేను గతంలోనూ చాలా స్పష్టంగా ఈ విషయం గురించి చెప్పాను. ఇప్పుడు కూడా చెబుతున్నాను. ఎవరికి ఏం తినడం ఇష్టమో వారు అది తిన్పొచ్చు. రాజ్యాంగం అందరికీ ఆ హక్కు కల్పించింది. దానిని ఎవరూ అడ్డుకోలేరు. కాని బీజేపీ, దాని అనుచరులు ఈ విషయంలో చేస్తున్న చేష్టలు ఎన్నటికీ ఆమోద యోగ్యం కాదు'' అని వెల్లడించారు.

## అసోంలో మదర్సాలను తొలగించే బిల్లుకు ఆమోదం



అసోంలో ప్రభుత్వ సాయంతో నడుస్తున్న ధార్మిక పాఠశాలల (మదర్సాల) తొలగింపు బిల్లు ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం పొందింది. ఈ మదర్సాలన్నీ 2021 ఏప్రిల్ నుంచి సాధారణ పాఠశాలలుగా మారనున్నాయి. ఈ మదర్సాలలోని బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, ఇతర అలవెన్సులలో ఎలాంటి మార్పులు ఉండవు. బిల్లు ఆమోదం సందర్భంగా ప్రతిపక్షం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని పట్టుపట్టింది. ప్రతిపక్ష పార్టీల ప్రతిపాదనను ప్రభుత్వం తోసిపుచ్చడంతో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. మదర్సాల్లో ఇతర సబ్జెక్టులో కూడా బోధిస్తున్నారు. వాటిని మూసివేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రభుత్వాన్ని నిలదీశాయి. రాష్ట్రంలో మత విద్వేష వాతావరణం నెలకొల్పేందుకు ఈ చట్టం చేశారని దుయ్యబట్టాయి. మార్చి, ఏప్రిల్ మాసాల్లో అసోంలో ఎన్నికలు జరగనున్నాయి.

సర్వత్రా

## మస్జిదుల్ హరామ్‌లో ప్రత్యేక సదుపాయాలు



తవాఫ్ నుంచి సయీ వరకు ఉమ్రా ప్రక్రియలన్నీ 75 నిమిషాల్లో పూర్తవుతున్నాయని మస్జిదుల్ హరామ్, మస్జిదె నబవీ వ్యవహారాల జనరల్ ప్రెసిడెన్సీ వెల్లడించింది. జనరల్ ప్రెసిడెన్సీ ఈ విషయాన్ని వెల్లడిస్తూ 3 వేల 275 మంది ఉమ్రా యాత్రికులతో జరిపిన సమీక్ష ఫలితాలను వెల్లడిస్తున్నామని తెలిపింది. కరోనా సంక్షోభం తరువాత కల్పించిన సదుపాయాలు కారణంగా తవాఫ్ కోసం సగటున 25 నిమిషాలు పడుతుంది. మతాఫ్ నుంచి సఫా వరకు చేరేందుకు 8 నిమిషాలు పడుతుంది. సఫా మరియు మర్వా మధ్య సయీ చేయడానికి సగటున 42 నిమిషాలు పడు తుందని పేర్కొంది. ఇలా తవాఫ్ నుంచి సయీ పూర్తయ్యే వరకు ఉమ్రా ప్రక్రియలన్నిటి కోసం మొత్తంగా 75 నిమిషాల సమయం పడుతుందని వివరించింది.

## ఖజకిస్తాన్‌లో మరణదండన తొలగింపు

తమ దేశంలో మరణశిక్షను తొలగిస్తున్నట్లు ఖజకిస్తాన్ ప్రకటించింది. మరణశిక్ష తొలగింపు విషయాన్ని అధ్యక్షుని వెబ్‌సైట్ ద్వారా ప్రకటించడం జరిగింది. ఈ ప్రకటన ప్రకారం ఖజకిస్తాన్ 2003 నుంచి మరణ శిక్షను అమలు పరచడం లేదు. అయితే న్యాయస్థానాలు మాత్రం తీవ్రమయిన అపరాధాలకు పాల్పడిన నేరస్థులకు మరణ శిక్షలయితే విధిస్తున్నాయి. ఈ నేరస్థుల్లో తీవ్రవాదులు కూడా ఉన్నారు. అయితే మరణశిక్షలు మాత్రం అమలు పరచడం లేదు. ఖజకిస్తాన్ తీసుకున్న ఈ నిర్ణయంతో మరణశిక్షలు పడిన నేరస్థులందరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధించడం జరుగుతుంది.

## సౌదీ మహిళలకు తమ పేరు మార్చుకునే అనుమతి

సౌదీ మహిళలు ఇక నుంచి తమ సంరక్షకుల అనుమతి లేకుండానే తమ పేరు మార్చుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు సౌదీ అరేబియా నగర వ్యవహారాల శాఖ ప్రతినిధి ముహమ్మద్ అల్ జాసిర్ పేర్కొన్నారు. 18 యేళ్ళు, దానికంటే పెద్ద వయస్సు గల వారు తమ వద్ద గుర్తింపు కార్డు ఉంటే తమ తల్లిదండ్రుల అనుమతి లేకుండానే వారు తమ పేరు మార్చుకోవచ్చున్నారు. 18 ఏళ్ళ లోపువారు మాత్రం తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. అల్ జాసిర్ మాట్లాడుతూ.... పేరుకు ముందు భాగంలో మార్పులు, తప్పులు సరిదిద్దడానికి ఇక ఎక్కువ సమయం పట్టదన్నారు. కుటుంబం పేరులో ఏవయినా మార్పులు చేయదలచుకుంటే ఉదాహరణకు “అల్”, లేదా “బిన్” లాంటి పదాలు చేర్చాలన్నా లేదా తొలగించాలన్నా కుటుంబ సభ్యుల అనుమతి అవసరం ఉంటుందని వెల్లడించారు.

## నమాజీల కోసం తెరుచుకున్న మస్జిదె నబవీ పైకప్పు



మదీనా మునవ్వరాలోని మస్జిదె నబవీ పైకప్పును నమాజీల కోసం తెరిచారు. ఇక నుంచి అక్కడ ఫజ్ర్, మగ్రిబ్ మరియు ఇషా నమాజ్‌లు చేయవచ్చు. మస్జిదె నబవీలో పెరుగుతున్న నమాజీల రద్దీ, నమాజ్ సమయంలో భౌతిక దూరం పాటించడం వల్ల స్థలం సరిపోకపోవడంతో మస్జిద్ పైకప్పును కూడా తెరిచినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కరోనా వైరస్ నుంచి రక్షణ కోసం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

# విద్యాజ్ఞానాల్ని కూడా ఖుర్‌ఆన్ కట్టిపడేసింది

**- అబుల్ ఫౌజాన్**

అరబీ భాష పట్ల ఖుర్‌ఆన్ వ్యవహారం ఎలా ఉందో, విద్యా జ్ఞానాల పట్ల కూడా దాని వ్యవహారం అలాగే ఉంది. ఖుర్‌ఆన్ విద్యా జ్ఞానాల్ని తన అదుపాజ్ఞల్లో ఉంచిందా అన్నట్లుంటుంది దాని వ్యవహారం. అది జ్ఞానాన్ని కదలనివ్వడం లేదు. మొదటి రోజు ఖుర్‌ఆన్ ఏ విషయంలోనైనా ఒకమాట, ఒక వాస్తవాన్ని పేర్కొన్నదంటే అది చిట్టచివరిది, శాశ్వతం అయిపోయింది. విద్యా జ్ఞానాలు దాన్ని అధిగమించలేక పోతున్నాయి. లెక్కలేనన్ని జ్ఞాన పరిశోధనలు జరిగాయి. ఎంతో అభివృద్ధి జరిగింది. అయినా ఈ విద్యాజ్ఞానాలు ఖుర్‌ఆన్ పేర్కొన్న వాస్తవానికే కట్టుబడి ఉంటాయి, లేదా తిరుగుతూ, తిరుగుతూ ఏ స్థానమైతే మొదటి రోజు ఖుర్‌ఆన్ నిర్ణయించిందో అదే స్థానానికి చేరుకుంటాయి.

వేరొక వైపు మానవ వాక్కు దృష్టాంతాన్ని చూడండి. అది చిన్న చిన్న విషయాల్లో సైతం ఈ ప్రమాణానికి సరితూగదు. దీనికి భిన్నంగా ఖుర్‌ఆన్ గొప్ప విషయాల్లో, లోతైన, గంభీరమైన వ్యవహారాల్లో సైతం తన ఉన్నత ప్రమాణాన్ని, సత్యతను నిలుపుకునే ఉంటుంది. ఇక్కడో దృష్టాంతాన్ని చూడండి :

“అరిస్టాటిల్ తన ఊహా జగతిలో స్త్రీకి తక్కువ స్థాయిని ఇచ్చాడు. దీనికి అతని వద్ద గల దృష్టాంతం లేక సాక్ష్యం ఏమిటంటే స్త్రీ నోటిలో పురుషునికన్నా తక్కువ పళ్ళుంటాయి.” బర్ట్రెండ్ రస్సెల్ దీని గురించి అతన్ని పరిహసించాడు. ‘సమాజంపై సైన్స్ ప్రభావం’ (The Impact of Science on Society) అనే తన గ్రంథంలో అరిస్టాటిల్‌ను ఎగతాళి చేస్తూ ఇలా వ్రాశాడు : "Aristotle maintained that women have fewer teeth than men, although he was twice married, it never occured to him to verify this statement by examining his wives mouth" (p.17)

“పురుషులకన్నా స్త్రీలకు తక్కువ పళ్ళుంటాయని అరిస్టాటిల్ వాదించాడు. అరిస్టాటిల్ రెండు వివాహాలు చేసుకున్నప్పటికీ, తన భార్యల నోర్లు పరిశీలించి తన ఈ వాదనను ధ్రువీకరించుకోలేకపోయాడు.”

అరిస్టాటిల్ వాదన వాస్తవం ముందు నిలబడలేకపోయింది. దీనికి భిన్నంగా ఖుర్‌ఆన్ ప్రకటనలు వాస్తవ పరిస్థితిని పరివేష్ఠించి ఉంటాయి. వాస్తవ పరిస్థితి, ఈ వాంగ్మూలము ఎన్నడూ పరస్పరం వ్యాఘాతం చెందవు. ఈ రెండింటిలో పరస్పర వ్యతిరేకత కనిపించదు. ఉదాహరణకు :

“దేవుడు ఈ విశ్వానికి ఏకైక నియంత అని, ఆయన దీన్ని తాను కోరుకున్న విధంగా నడిపిస్తాడని” ఖుర్‌ఆన్ చెబుతుంది. గడిచిన వేలాది సంవత్సరాల నుండి దైవం గురించిన ఈ భావన ఒక అంగీకృత సూత్రంగా నడుస్తూ వస్తున్నది. ఎలాంటి చర్చలేకుండా మనిషి దీన్ని అంగీకరిస్తూ వచ్చాడు.

కాని నేటి ఆధునిక కాలంలో జ్ఞానంలో అభివృద్ధి జరిగి మనిషి దీన్ని కాదని ఇంకొక సిద్ధాంతాన్ని రూపొందించుకున్నాడు. అదేమిటంటే జరుగుతున్న సంఘటనల వెనుక తెలిసిన భౌతిక కారణాలు తప్ప ఇంకే శక్తియునూ లేదు. సంఘటనలన్ని కూడా భౌతిక కారణాలు, పరివర్తనను అనుసరించి జరుగుతూ ఉంటాయి. ఇంకా భౌతిక నియమాలను అనుసరించి వీటిని సంపూర్ణంగా విశ్లేషించవచ్చు కూడాను. - కాని ఆ తరువాత జరిగిన జ్ఞానపరమైన పరిశోధనలు ఈ సిద్ధాంతాన్ని నేలమట్టం చేసేశాయి. ఇకిప్పుడు విద్యాజ్ఞానాలు ఆదిలో నిలిచి వున్న చోటికే తిరిగి చేరుకున్నాయి. ఇంకొక దృష్టాంతాన్ని కూడా పరిశీలించండి:

డార్విన్ పరిణామ సిద్ధాంతం గురించి ఇటీవలి కాలంలో జరిగిన పరిశోధనా ఫలితాల్ని ప్రొఫెసర్ జాన్ మీనార్డ్ స్మిత్ (Prof. John Minard Smith) "Encyclopedia of Ignorance"లో తన ఒక వ్యాసంలో ఈ సిద్ధాంతాన్ని ఇలా విశ్లేషించారు:

“పరిణామ సిద్ధాంతం పరిష్కరించనలవిగాని ఆంతరంగిక సమస్యలతో (Built-in-problems) సతమతమవుతున్నది. దీనికి ముఖ్య కారణం - మన వద్ద సిద్ధాంతాలైతే ఉన్నాయి, కాని వాస్తవిక సంఘటనల ద్వారా సిద్ధాంతాలను ధ్రువీకరించుకునే సాధనాలు మన వద్ద లేవు.”

*(‘ఎంత అద్భుతం ఈ ఖుర్‌ఆన్’ పుస్తకం నుంచి)*

**తు ది గే టు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**